
RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 04 జూలై 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:31

# ఎల్‌నినో ఎఫెక్ట్: ఖరీఫ్ సాగుపై

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, జులై 3: ఎల్‌నినో ఎఫెక్ట్ వల్ల ఖరీఫ్ సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా వాతావరణంలో పెను మార్పులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో గడిచిన జూన్‌లో సాధారణం కంటే 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, దీనికి ఎల్‌నినో ప్రభావమే ప్రధాన కారణమని ఆయన వివరించారు. ఇక తెలంగాణ విషయానికి వస్తే జూన్‌లో 22 శాతం వర్షపాతం లోటు ఏర్పడిందని, పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోనూ ఇదే పరిస్థితి ఉండటం వల్ల గోదావరి జలాల ప్రవాహం ఈసారి భారీగా ఆలస్యమయ్యే ప్రమాదం పొంచి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి రైతులు సాంప్రదాయ పంటల కంటే తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ప్రస్తుతానికి రాష్ట్రంలోని రిజర్వాయర్లలో ఉన్న నీటిని అత్యంత సమర్థంగా, పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు వర్షపాత వివరాలను, జలాశయాల్లోని నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తోందని, అయితే అన్నింటికంటే ముందుగా తాగునీటి అవసరాలకే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎల్‌నినో సృష్టించిన ఈ ప్రకృతి సవాళ్లను సరైన ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన నీటి పొదుపు చర్యలతోనే అధిగమించగలమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?..



## కేసీఆర్‌కు భట్టి సవాల్!

వార్త 2 లో

## న్యూఢిల్లీలో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మీడియా & కమ్యూనికేషన్ నోడల్ అధికారుల జాతీయ సదస్సు

### పాల్గొన్న తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులు





న్యూఢిల్లీ: భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఒకరోజు మీడియా ఉ కమ్యూనికేషన్ నోడల్ అధికారుల జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖకు చెందిన జిల్లా పౌర సంబంధాల అధికారులు, మీడియా నోడల్ అధికారులు, సోషల్ మీడియా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

దేశంలోని 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 240 మంది జిల్లా పౌర సంబంధాల అధికారులు హాజరైన ఈ సదస్సులో ఎన్నికల నిర్వహణలో కమ్యూనికేషన్ పాత్ర, మీడియా నిర్వహణ, ఎన్నికల చట్టాలు, డిజిటల్ సాంకేతికత వినియోగం, తప్పుడు ప్రచారాల నియంత్రణ, సోషల్ మీడియా సవాళ్లు, ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేసే విధానాలపై ఎన్నికల సంఘం అధికారులు సమగ్రంగా వివరించారు.

ఈ సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసే అధికారిక సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయడంతో పాటు తప్పుడు ప్రచారం, అపోహలు, దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత కమ్యూనికేషన్ అధికారులపై ఉందని పేర్కొన్నారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ూ×=) ప్రక్రియ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, పౌరసత్వ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగా అర్హులైన భారతీయ పౌరుల పేర్లు మాత్రమే ఓటరు జాబితాలో ఉండేలా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అపోహలు తొలగించి వాస్తవాలను చేరవేయడంలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత ముఖ్యమని చెప్పారు.

సదస్సులో ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఫారం-17సీ, ఆర్టికల్-324 కింద ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు, ఎన్నికల ప్రచార నిబంధనలు, పెయిడ్ న్యూస్ నియంత్రణ, సోషల్ మీడియా, కృత్రిమ మేధ వల్ల ఎదురవుతున్న సవాళ్లు, వాటిని ఎదుర్కొనే వ్యూహాలపై ఎన్నికల సంఘం సీనియర్ అధికారులు ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు.

అలాగే, ఎన్నికల సంఘం రూపొందించిన సమగ్ర డిజిటల్ వేదిక జుజ×చీవ్ ద్వారా ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ, పోలింగ్ కేంద్రాల సమాచారం, అభ్యర్థుల అఫిడవిట్లు, ఎన్నికల ఫలితాలు తదితర సేవలను ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన విధానాన్ని వివరించారు. ప్రతి స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు జుజ×చీవ్‌ను వినియోగించేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.

సదస్సులో ఎన్నికల కమ్యూనికేషన్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించే విధానాలు, మీడియాతో సమన్వయం, సోషల్ మీడియా వినియోగం, ప్రజల్లో ఎన్నికలపై అవగాహన పెంపు, తప్పుడు ప్రచారాన్ని వేగంగా ఖండించే వ్యూహాలపై విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు.

తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారుల కార్యాలయం నుంచి అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎన్. శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నరాజ్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ సంయుక్త సంచాలకులు యు. వెంకటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనరేట్ పౌర సంబంధాల అధికారులు ఎం. కిరణ్మయి, ఏ. వసంతో పాటు మీనాక్షి, ఇందిర, అనిల్, విశ్వేశ్ తదితర జిల్లా ప్రజా సంబంధాల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధుల కేటాయింపులో పన్నుల వసూళ్లే పనితీరుకు కొలమానం కాకూడదు - మంత్రిసీతక్క

**ఆదివాసీ, గిరిజన, మారుమూల, వెనుకబడిన జీపీలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలి**

**స్థానిక అవసరాల కోసం అన్‌టైడ్ గ్రాంట్లను కొనసాగించాలి**

**16వ ఆర్థిక సంఘం జాతీయ వర్క్‌షాప్‌లో తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి**



16వ ఆర్థిక సంఘం ప్రతిపాదించిన పనితీరు ఆధారిత గ్రాంట్లు, ఓన్ సోర్స్ రెవెన్యూ వంటి నిబంధనల్లో ఆదివాసీ, గిరిజన, షెడ్యూల్ ప్రాంతాలు, వెనుకబడిన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క కోరారు. గ్రామ పంచాయతీల పనితీరును కేవలం పన్నుల వసూళ్లతోనే అంచనా వేయకుండా, ప్రజలకు అందిస్తున్న సేవలు, పారిశుధ్యం, పారదర్శకత, డిజిటల్ పాలన, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

16వ ఆర్థిక సంఘం గ్రామీణ స్థానిక సంస్థల సిఫార్సులపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో మంత్రి సీతక్క తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయాలను వివరించారు. స్పెషల్ సీఎస్ దానకిషోర్ తో పాటు ఇతర రాష్ట్రాల మంత్రులు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...జీపీలకు పనితీరు ఆధారిత గ్రాంట్లను తెలంగాణ ప్రభుత్వం స్వాగతిస్తోందని, అయితే ఆదాయ సామర్థ్యం తక్కువగా ఉన్న ఆదివాసీ, గిరిజన, మారుమూల ప్రాంతాల గ్రామ పంచాయతీలపై అదనపు పన్నుల భారం మోపే విధంగా నిబంధనలు ఉండకూడదన్నారు. అభివృద్ధిని ప్రజల ఆర్థిక స్థితితో ముడిపెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు.

షెడ్యూల్ ప్రాంతాల్లో అనేక గ్రామ పంచాయతీల జనాభా చాలా తక్కువగా ఉండటంతో వాటి సొంత ఆదాయ వనరులు కూడా పరిమితంగానే ఉంటాయని తెలిపారు. అలాంటి ప్రాంతాలకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని, ఆదివాసీ, గిరిజన, షెడ్యూల్ కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామ పంచాయతీలు, మండల స్థాయి స్థానిక సంస్థలకు కూడా పనితీరు గ్రాంట్ల అర్హతలో వెసులుబాటు కల్పించాలని కోరారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల కారణంగా ఎన్నికలు జరగని 62 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి నిధులు నిలిపివేయడం వల్ల అక్కడి ప్రజలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల వల్ల ఎన్నికలు ఆలస్యమైన ప్రత్యేక పరిస్థితుల్లో నిధులు కొనసాగించేలా నిబంధనలు ఉండాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి గ్రామ అవసరం భిన్నంగా ఉంటుందని, అందువల్ల స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయాలు తీసుకునేలా అన్‌టైడ్ బేసిక్ గ్రాంట్లను తగిన స్థాయిలో కొనసాగించాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. డిజిటల్ గవర్నెన్స్, ఈ-గ్రామ్ స్వరాజ్, పీఎఫ్ఎంఎస్ వంటి వ్యవస్థలను తెలంగాణ ప్రభుత్వం స్వాగతిస్తోందని... వాటి అమలుకు అవసరమైన శిక్షణ, సిబ్బంది, ఇంటర్నెట్ కనెక్టివిటీ, సాంకేతిక మౌలిక వసతులను మారుమూల గ్రామాల్లో కేంద్రం బలోపేతం చేయాలని కోరారు.

షెడ్యూల్ ప్రాంతాలు, వెనుకబడిన జిల్లాలు, భౌగోళికంగా క్లిష్టమైన ప్రాంతాల్లో ప్రజా సేవలను అందవేసేందుకు అధిక వ్యయం అవుతున్నందున నిధుల కేటాయింపులో అలాంటి ప్రాంతాలకు ప్రత్యేక వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. బలమైన గ్రామ పంచాయతీలు, బలమైన రాష్ట్రాలు కలిసి బలమైన భారత నిర్మాణానికి పునాది వేస్తాయని మంత్రి సీతక్క అన్నారు.

బలమైన గ్రామ పంచాయతీలు, బలమైన రాష్ట్రాలు కలిసి బలమైన భారత నిర్మాణానికి పునాది వేస్తాయని మంత్రి సీతక్క అన్నారు. గ్రామీణ స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలంటే రాష్ట్రాలకు తగిన ఆర్థిక సామర్థ్యం ఉండాలని, సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను బలోపేతం చేస్తూనే పంచాయతీలను మరింత శక్తివంతం చేసే విధంగా 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు ఉండాలని మంత్రి సీతక్క సూచించారు

# పూటకో సవాల్... రోజుకో అడ్రస్....

వార్త 2 లో

ప్రజాబలం

04 జూలై 2026 శనివారం

# పార్లమెంట్ లో వ్యూహాత్మకంగా కార్యాచరణ

2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదింప జేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఉంది కేంద్రం. రెండింటికి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా?ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తోంది.

వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. మహిళా కోటా విషయానికొస్తే.. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం.. పునర్విభజన తర్వాతే 33 శాతం కోటా అమల్లోకి రావాలి. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా వన్-థర్డ్ కోటాను మహిళలకు కేటాయించనున్నారు. దీంతో అదే దామాషాలో ఆయా వర్గాల మహిళలకూ లబ్ధి చేకూరుతున్నట్టే. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి. నియోజకవర్గాల పునర్విభజన కాకపోవడంతో ఈ చట్టం అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందుగానే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే మరో రాజ్యాంగ సవరణ తప్పనిసరి. చట్టం ఏర్పడిన తర్వాత వచ్చే మొదటి జనాభా లెక్కల సేకరణ అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళలకు రిజర్వేషన్‌ను అమలుచేయాలని చట్టం నిర్దేశిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు అతీతంగా ఇది అమలు చేయాలంటే ఈ చట్టంలోని సెక్షన్ 5ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది. ఇది పార్లమెంట్ ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఆమోదంతోనే చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని? రాజ్యాంగంలోని 368(2) అధికరణ నిర్దేశిస్తోంది.నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే పలు రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. అలా రాజ్యాంగ సవరణ కోసం ప్రవేశపెట్టే బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభలో సభ్యుల హాజరు సగానికిపైగా ఉండాలి. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలుపాలి. అప్పుడే ఆ బిల్లు ఆమోదం పొందుతుంది. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 540 మంది ఎంపీలు సభకు హాజరైతే.. వారిలో 360 మంది తప్పనిసరిగా బిల్లుకు మద్దతు తెలపాలి. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు రాజ్యసభ ముందుకు వస్తుంది. రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న 244 మంది సభ్యులు సభకు హాజరైతే.. 163 మంది బిల్లుకు మద్దతు తెలపాలి. అప్పుడే ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదం అనంతరం చట్టంగా మారుతుంది. కానీ అధికార ఎన్డీయే కూటమికి ఉభయ సభల్లో ఇప్పుడు అంత బలం లేదు. అందుకే ఆ బలం కూడగట్టానికి రకరకాల రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఏప్రిల్‌లో మహిళా రిజర్వేషన్ ప్యాకేజీలో భాగంగా వచ్చిన డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో 54 ఓట్ల తేడాతో ఆమోదం పొందలేదు. అయితే తాజా రాజకీయ పరిణామాల తరుణంలో అదే బిల్లు మళ్లీ ప్రవేశపెడితే ఆమోదం పొందే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో బలాబలాలు చూస్తే.. మొత్తం సభ్యుల సంఖ్య 543గా ఉంది. మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే ప్రస్తుత సభ్యుల సంఖ్య 540 మాత్రమే. మూడింట రెండొంతుల మెజార్టీ అంటే 360 మంది మద్దతు కావాలి. ఎన్డీఏకు ప్రస్తుతం 318 మంది సభ్యులున్నారు. ప్రతిపక్షానికి 184 మంది సభ్యుల బలం ఉంది. ఇతరులు 38 మంది ఉన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లుల ఓటింగ్ సమయంలో 528 మంది సభ్యులు హాజరయ్యారు. అప్పుడు బిల్లు ఆమోదానికి 352 ఓట్లు అవసరమయ్యాయి. ఎన్డీయే కు అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే రావడంతో 54 ఓట్ల తేడాతో బిల్లు ఆగిపోయింది. కానీ అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం టీఎంసీ రెబల్ ఎంపీలు 20 మంది, ఉద్ధవ్ థాక్రే శివసేన ఎంపీలు ఆరుగురు కలిపి ఎన్డీఏ ఖాతాలోకి 26 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా. అప్పుడు లోక్‌సభలో ఎన్డీఏ బలం 318 నుంచి 344కు పెరుగుతుంది.స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కాంగ్రెస్‌తో విభేదాల తరుణంలో ఇండి కూటమికి దూరమైంది. ఇప్పటికే బీజేపీ డీఎంకేను ఎన్డీఏలోకి ఆహ్వానించిందనే ప్రచారం జరుగుతోంది. డీఎంకే ఎన్డీఏలో చేరకపోయినా.. లోక్‌సభలో ఎన్డీఏకు జై కొడితే.. ఆ పార్టీకి చెందిన 22 మంది ఎంపీల బలం కూడా జత కలుస్తుంది. అప్పుడు ఎన్డీఏ బలం ఏకంగా 344 నుంచి 366కు పెరుగుతుంది. ఇప్పటికే ఈ మేరకు స్టాలిన్ నుంచి హామీ ఉందని కూడా బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం చేసుకుంటోంది. సరే ఇక్కడివరకు లోక్‌సభలో పరిస్థితి ఓకే. కానీ కీలకమైన రాజ్యసభ సంగతేంటి అనే ప్రశ్న వస్తుంది. రాజ్యసభలో రెండొంతుల మెజారిటీకి 164 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ దగ్గర 150 మంది సభ్యులు ఉన్నారు. ఇక్కడ కూడా డీఎంకేకు చెందిన 8 మంది సభ్యుల మద్దతు లభిస్తే సంఖ్య 158కు చేరుతుంది. అప్పుడు మరో ఆరుగురు సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. అయితే వచ్చే సెషన్‌లో మహిళా, డీలిమిటేషన్ బిల్లులు వచ్చే సమయానికి.. ఏదో రకంగా ఈ బలం సమకూర్చుకోవచ్చనేది బీజేపీ ఆలోచనగా ఉంది. పైగా ఒక్కసారి బిల్లులు లోక్‌సభ ఆమోదం పొందితే.. రాజ్యసభలో అనుకోని విధంగా మద్దతు లభిస్తుందనే లెక్కలు కూడా లేకపోలేదు.ఇప్పటికే టీఎంసీ, శివసేన యూబీటీ నుంచి ఎంపీల్ని ఆకర్షించి మద్దతు కూడగట్టడంలో సఫలమైన బీజేపీ..ఇప్పుడు శరద్ పవార్ ఎన్సీపీ, నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్, పంజాబ్‌లో ఆప్ మీద కూడా కన్నేసినట్టు చెబుతున్నారు. త్వరలో ఈ ఆపరేషన్లు కూడా కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని చిన్న పార్టీలతో చర్చలు పూర్తయ్యాయని, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక విపక్షానికి మరిన్ని షాకులిచ్చే ఉద్దేశంతో బీజేపీ ఉందనే చర్చ జరుగుతోంది. ఏదే?నా ప్రస్తుతం హస్తిన వేదికగా రాజకీయ వ్యూహాలు జోరుగా సాగుతున్నాయి. నయానో భయానో ఎంపీల బలం పెంచుకోవటానికి బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. కుదిరితే రాష్ట్ర స్థాయి నేతలు, పార్టీ సీఎంలు, అవసరమైతే అగ్రనేతలే నేరుగా రంగంలోకి దిగి పని పూర్తిచేయాలనే కార్యాచరణ సిద్ధమైంది. అన్నింటికీ మించి డీలిమిటేషన్ బిల్లును తిప్పికొట్టామనే ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతున్న ప్రతిపక్ష కూటమిని నైతికంగా చావుదెబ్బ కొట్టాలనేది కాషాయ పార్టీ లక్ష్యంగా ఉంది. అందుకే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాగానే రాజకీయ సమీకరణాలు మార్చే పని మొదలుపెట్టారనే అభిప్రాయాలు వస్తున్నాయి.లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్రం మరో ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది. లోక్ సభ నియోజకవర్గాలను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 824కి పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఇప్పటికే సూచన చేసింది. . అంటే ప్రతీ రాష్ట్రంలో ఉన్న సీట్లలో మరో యాభై శాతం పెంచే బదులుగా?మరో కొత్త ఫార్ములాతో ఈ మండలి ప్రతిపాదనలు ఉండడం ఆసక్తిని పెంచుతోంది.

# పూటకో సవాల్...రోజుకో అడ్రస్....

**చీము,నెత్తురు ఉంటే మంత్రి జూపల్లి రాజీనామా చేయాలి**

**సంగారెడ్డిలో ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములు లాక్కుంటున్న కాంగ్రెస్ సర్కార్:మాజీ మంత్రి హరీశ్ రావు**





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 3(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం, సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డెప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను,మంత్రుల అబద్ధాలను ఎండగట్టారు,ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు,స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్యేలు మాణిక్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, శశిధర్ రెడ్డి, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,మాజీ మంత్రి హరీశ్ రావు కామెంట్స్ జూపల్లి కృష్ణారావు మళ్లీ ప్రెస్ మీట్ పెట్టిండు. నిన్న వాళ్ల గోల్ కొడుదాం అనుకుంటే సెల్ఫ్ గోల్ అయిపోయింది,అందుకే డ్యామేజ్ కంట్రోల్ మొదలు పెట్టిర్రు అందులో కూడా పప్పులో కాలు వేసిర్రు. దాని సంగతి ఏందో చూద్దాం మొన్న సవాల్ విసిరి నిన్న తోక ముడిచి నాకు వాట్సాప్ లో ఒక ఉత్తరం పెట్టిండు. పూటకో సవాలు రోజుకో అడ్రస్ లెక్క ఉంది జూపల్లి సంగతి మొదలేమో తెలంగాణ భవన్ అన్నడు తర్వాత అమరవీరుల స్థూపం అన్నడు ఇప్పుడేమో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ అంటుండు,ముందు నన్ను, కేటీఆర్‌ను చర్చకు రమ్మన్నాడు ఇప్పుడు కేసీఆర్‌ను రావాలంటున్నారు,2023 డిసెంబర్ నుండి 2026 జూన్ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్బీఎం కింద తెచ్చిన అప్పు రూ.1,86,087 కోట్లు అయితే.. ఆయన నాకు రాసిన ఉత్తరంలో రూ.1,77,058 కోట్లు అని చెప్తుండు. మరి ఆ 10 వేల కోట్లు ఎక్కడికి పోయినయి?మార్చి 18, 2026 నాడు అసెంబ్లీలో నేను గట్టిగా నిలదీస్తే రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మా ప్రభుత్వం 27 నెలల్లో చేసిన అప్పు రూ. 3,47,294 కోట్లు అని అసెంబ్లీ సాక్షిగా చెప్పిండు. ఇందులో ఏది నిజం? 4 నెలల కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పింది నిజమా? మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పింది నిజమా? అంటే ఇప్పుడు రాజీనామా ఎవరు చేయాలి? పాలమూరు బిడ్డవైతే.. పౌరుషం ఉంటే, చీము నెత్తురు ఉంటే వెంటనే రాజీనామా చెయ్యి మిస్టర్ జూపల్లి నువ్వు కాదు, మీ ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి,మొత్తం మీ క్యాబినెట్ ను కూసోబెట్టి నిండు అసెంబ్లీలో బీఆర్ఎస్ చేసిన అప్పు 4 లక్షల కోట్లే అని నిరూపించిన, మీ అబద్ధాలను కడిగి పారేసిన ఇప్పుడేదో వచ్చి చర్చిద్దాం అంటున్నవ్, అప్పుడు నేను సవాల్ చేస్తే అసెంబ్లీలోనే తలలు కిందవేసుకోని సప్పుడు చేయలేదు. సీనియర్ మంత్రి అంటూనే మీ క్యాబినెట్ ఎంత అప్పు చేసిందో తెల్వదా?కాగ్ రిపోర్టు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ. 4.15 లక్షల కోట్లు అని అసెంబ్లీలో చెప్పింది. నేనూ చెప్పింది, కాగ్ చెప్పింది ఒక్కటే. అబద్దాలు చెబుతూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు,జూపల్లి గారు నేను అసెంబ్లీలో మాట్లాడిన వీడియో, రేవంత్ రెడ్డి మాట్లాడిన వీడియో, ఆర్బీఐ లెక్కలు మీకు వాట్సప్ లో పంపుతున్నా చదువుకో.. చీము నెత్తురు ఉంటే రాజీనామా చేయాలని సవాల్ విసురుతున్నా,బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ గారి ఆశీర్వాదంతో మన సంగారెడ్డి జిల్లా, సదాశివపేట నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా నిధులు తీసుకొచ్చాం కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ హయాంలో మంజూరైన ఎస్డీఎఫ్ నిధులను కూడా వెనక్కి తీసుకునే పరిస్థితి వచ్చింది,అదే విధంగా సంగమేశ్వర--బసవేశ్వర ప్రాజెక్టు ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును అటకెక్కించి సంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం చేస్తోంది,రేపు ఏడు మండలాల ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. సంగమేశ్వర ప్రాజెక్టు గురించి, బసవేశ్వర ప్రాజెక్టు గురించి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కరోజైనా మాట్లాడారా? జిల్లాకు చెందిన మంత్రి ఈ అంశంపై ఎందుకు మాట్లాడటం లేదు? మీ నియోజకవర్గాల్లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు ఇస్తే,మా సంగారెడ్డి జిల్లాకు, మా రైతులకు ఉపయోగపడే సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టులకు ఎందుకు నిధులు ఇవ్వడం లేదు తక్షణమే ఈ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి,లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యమాలు,పాదయాత్రలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని సమాచారం వచ్చిన వెంటనే కేసీఆర్ తో మాట్లాడి రెండు రోజుల్లోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేవాళ్లం కానీ ఇప్పుడు బీఆర్ఎస్ రోడ్డెక్కితే తప్ప ప్రభుత్వం స్పందించడం లేదు. ఇప్పటికే రైతులకు రావాల్సిన సుమారు రెండు కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి,సంగారెడ్డి జిల్లాకు రావాల్సిన ఆ నిధులు ఇప్పటికీ ఎందుకు విడుదల చేయలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలి,సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతు చేస్తాం అని చెప్పి ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు,సింగూరు ప్రాజెక్టు సంగారెడ్డి జిల్లాకే కాదు, హైదరాబాద్‌కు తాగునీరు అందించే కీలకమైన ప్రాజెక్టు. ఇప్పటికైనా తక్షణమే మరమ్మతులు చేపట్టాలి,ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ, బీసీల అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు ఉన్న భూములనే లాక్కుంటోంది,ఒక్క సంగారెడ్డిలోనే 700 ఎకరాలు, రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కునే కుట్ర జరుగుతోంది,ఎకరం రూ. 3 కోట్లు ఉంటే రూ. 40 లక్షలు ఇస్తామని గిరిజనులను మోసం చేస్తున్నారు,మహిళలకు నెలకు రూ.2500, వృద్ధులకు రూ.4000 పెన్షన్, ఫీజు రీయింబర్స్ మెంట్, పీఆర్సీ..ఇలా ఏ ఒక్క హామీని రేవంత్ ప్రభుత్వం నెరవేర్చలేదు మూసీ సుందరీకరణ పేరుతో హడావుడి చేస్తున్న ప్రభుత్వం మల్లన్నసాగర్ గురించి ఎందుకు మాట్లాడటం లేదు? ఆ మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు, మూసీకి నీళ్లు వెళ్తున్నాయంటే అది కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషే మల్లన్నసాగర్ రేవంత్ రెడ్డి అయ్య కట్టాడా? ఈరోజు హైదరాబాద్‌కు అది పెద్ద దిక్కుగా మారిందంటే అది కేసీఆర్ చలువే అని అన్నారు.

## బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?..
## కేసీఆర్‌కు భట్టి సవాల్!

హైదరాబాద్, జూలై 3 తెలంగాణ అప్పులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో భారీ అప్పులు చేశారని అన్నారు. అప్పులపై కేసీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి తెలిపారు. ఇందులో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపై సాగిందని విమర్శించారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వ అప్పుల కారణంగా రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని భట్టి చెప్పారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. అధిక వడ్డీ అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిందని భట్టి ఆరోపించారు. కొత్త కోల్ బ్లాకులు తీసుకురాలేదని విమర్శించారు. బొగ్గు మాయం ఆరోపణలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కొత్త కోల్ బ్లాకుల కోసం కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

తప్పుల తడకలు

రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తనకు లేఖ రాశారని తెలిపారు. అయితే, ఇదే అంశంపై నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం చేసిన అప్పు రూ. 3,45,294 కోట్లు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు.ఒకే ప్రభుత్వంలోని మంత్రి ఒక లెక్క, ముఖ్యమంత్రి మరో లెక్క చెప్పడం గందరగోళానికి దారితీస్తోందని హరీశ్ రావు అన్నారు. అప్పుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ లెక్కల్లో ఏది నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

"తెలంగాణ అప్పులపై చర్చ

తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం మరి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. "ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందాం రండి" అని ధ్వజమెత్తారు. తన లెక్కలు తప్పు అయితే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు తక్షణమే రాజీనామా చేస్తానని, మరి వారి లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్పే లెక్కలు నిజమేనని మీడియా ముందు ఒప్పుకోవాలని అన్నారు.అసెంబ్లీలో రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీశ్‌రావు ఒక్కొక్కరు ఒక్కో రకమైన అబద్ధపు లెక్కలు చెప్పారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల అప్పుల భారం మోపారని ఆయన మండిపడ్డారు. కార్పొరేషన్ల ద్వారా దొంగచాటుగా తెచ్చిన అప్పులను వీరు ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు.

తాను ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, వ్యాపారాలు చేసుకుని రాజకీయాల్లోకి వచ్చానని.. పారిపోయే లక్షణం తనకు లేదని, అబద్ధాలు చెప్పే అలవాటు అంతకన్నా లేదని స్పష్టం చేశారు.

# ఉచిత యూపీఎస్సీ ,సివిల్ సర్వీసెస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

## అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## :: బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 03 2026 కలెక్టరేట్‌శుక్రవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్ లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ పోస్టర్ లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్, బంజారాహిల్స్, హైదరాబాద్ ద్వారా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష--2027 కు సంబంధించిన సి సాట్ ఉచిత శిక్షణ కార్యక్రమం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులకు చెందిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకుండా ఉండాలని పేర్కొన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమానికి ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుల చివరి తేదీ 12 జూలై 2026 అని తెలిపారు.

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 19 జూలై 2026న వరంగల్‌లోని సుబేదారి యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.

ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి, హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్, బంజారాహిల్స్‌లో ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు నాణ్యమైన ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

కావున జిల్లాలోని అర్హులైన యువతీ యువకులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూర్తి వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం

ఠర్బఌఎఓఱతీఎశ్రీవ.ఔశీ.ఱఅ వెబ్సైట్ ను సంప్రదించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ డెవలప్మెంట్ అధికారి కొమురయ్య, ఏవో అల్లం రాజ్ కుమార్, ఎస్ ఓ లాల్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

## ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన...

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధ జూలై 03 2026 ములుగు శుక్రవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు వర్షాల పరిస్థితులు, ముందస్తు జాగ్రత్తలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. ఎక్కడైనా వరద ముప్పు ఏర్పడే అవకాశం ఉంటే ముందుగానే చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ, ఎం పి ఓ లు, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన సహాయక చర్యలు, అత్యవసర సేవలు వెంటనే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి...

## సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియంను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 3(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా: సంగారెడ్డి/పట్టణంలోని పాత డీఆర్‌డీఏ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియంను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం నాడు సందర్శించారు,ఈ సందర్భంగా మ్యూజియంలో ఏర్పాటు చేసిన జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్, గణితం,వినోదాత్మక విజ్ఞాన ప్రదర్శనలు, ప్రముఖ శాస్త్రవేత్తల వివరాలు, అంతరిక్షానికి సంబంధించిన ఫోటో గ్యాలరీ, శాటిలైట్ నమూనాలు,డైనోసార్ నమూనా, బొటానికల్ గార్డెన్, సమావేశ మందిరంలో విద్యార్థులు రూపొందించిన గణిత ప్రాజెక్టులను పరిశీలించి కలెక్టర్ అభినందించారు,జిల్లా సైన్స్ మ్యూజియంలో త్వరలోనే రోబోటిక్స్‌కు సంబంధించిన ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు,జిల్లాలో నిర్వహిస్తున్న సంచార విజ్ఞాన ప్రయోగశాల, సోహం రోబోటిక్స్, జన్య ఫౌండేషన్ సైన్స్ ల్యాబ్ కార్యక్రమాల గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు,సంచార విజ్ఞాన ప్రయోగశాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు,ప్రతి పాఠశాలలో అందుబాటులో ఉన్న సైన్స్ ప్రయోగశాలలను సమర్థవంతంగా వినియోగించి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని అన్నారు,అదేవిధంగా పరిసరాల్లో లభ్యమయ్యే వస్తువులను ఉపయోగించి నిజ జీవితానికి అనుసంధానించే విధంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు,సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియంను సందర్శించదలిచిన పాఠశాలలు ముందస్తుగా జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డిని 63022 90235 ఫోన్ నంబర్ లో సంప్రదించి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు,ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి శంకర్, డీసీఈబీ కార్యదర్శి లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి పి. సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# హోమ్ మంత్రిగారి మౌనమెందుకో...

విజయవాడ, జూలై 3,ఏపీ హోం మినిస్టర్ వంగలపూడి అనిత యమా యాక్టివ్‌గా ఉంటారు. పొలిటికల్ ప్రత్యర్థులపై ఓ రేంజ్‌లో విరుచుకుపడుతుంటారు. ప్రతిపక్ష నేత జగన్‌ను ఉద్దేశించి పులివెందుల ఎమ్మెల్యే అని సెటైరికల్‌గా మాట్లాడ్డం ఆమెతోనే మొదలైందని చెప్పుకుంటాయి రాజకీయవర్గాలు. అంతవరకు సరే.. రాజకీయ వ్యవహారాల్లో ఎవరి లెక్కలు వారికి ఉంటాయి. కానీ, మంత్రి హోదాలో ఉండి సంబంధింత శాఖ వ్యవహారాల గురించి పట్టించుకోకుండా అనిత కేవలం పొలిటికల్ స్టేట్‌మెంట్స్‌కే పరిమితం అవుతున్నారా అన్నది చాలా మందికి వస్తున్న లేటెస్ట్ డౌట్.ఎందుకంటే.. రాష్ట్రాన్ని కుదిపేసిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసుపై హోం మినిస్టర్ సక్రమంగా స్పందించలేదన్నది రాజకీయవర్గాల విస్తృతాభిప్రాయం. ఆ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు ఒకే ఒక్కసారి స్పందించారామె. అదీ కూడా కేవలం ఐదు సెకన్ల రియాక్షన్. సాధారణంగా పొలిటికల్ స్టేట్‌మెంట్స్ విషయంలో అనర్గళంగా మాట్లాడే అనిత అత్యంత కీలకమైన కేసు విషయంలో కేవలం ఐదు సెకన్లకే ఎందుకు పరిమితం అయ్యారన్నది బిగ్ క్వశ్చన్. రాష్ట్ర హోం మంత్రిగా అంత సీరియస్ సమస్య మీద సరిగా స్పందించకపోవడంపై వివిధ వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయట.కస్టోడియల్ డెత్ కేసు విషయంలో ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ మంత్రే మాట్లాడ్డం లేదా? లేక స్పందించవద్దని ఆమెకు ఆదేశాలున్నాయా అన్న చర్చలు సైతం పెరుగుతున్నాయి. ఇదే విషయాన్ని విపక్షాలు సైతం నిలదీస్తున్నాయి. అత్యంత ముఖ్యమైన కేసు విషంలో హోం మంత్రి స్పందన అత్యంత పేలవంగా ఉండటం ఏంటి? హోం మంత్రి నోరు కట్టేస్తోంది ఎవరో తేల్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు ప్రతిపక్ష నాయకులు. ఈ కేసుకు సంబంధించి హోం మంత్రి రియాక్షన్‌పై రాజకీయవర్గాలతో పాటు సామాన్యుల్లో సైతం రకరకాల డౌట్స్ పెరుగుతున్నాయట.రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి ఒకరు హోం మినిస్టర్ మేకప్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే.. అంతా ఖండించారు. అలాంటిది ఒక ప్రాణం విషయంలో ఆ స్థాయి స్పందన లేకపోవడం ఏంటన్న మాటలు వినిపిస్తున్నాయి. పై నుంచి వచ్చిన ఆదేశాలతోనే అనిత అలా వ్యవహరిస్తున్నారా అన్న సందేహాలు చాలామందిలో వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత మంత్రికంటే ఎక్కువగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించారు. అయినాసరే ఆమె నుంచి నో రియాక్షన్ అంటే? దీన్నెలా అర్థం చేసుకోవాలంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెడుతున్నారు పరిశీలకులు. ఇదే సమయంలో చాలామంది ఇప్పుడు డిప్యూటీ సీఎం వ్యాఖ్యలను కోట్ చేస్తున్నారట. నేనే హోమ్ మంత్రి అయిఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేదని పవన్ వ్యాఖ్యానించడం..అనిత విషయంలో సరిగ్గా సరిపోతుందా అనే చర్చలు సైతం నడుస్తున్నాయి. పవన్‌కళ్యాణ్ ఏ ఉద్దేశ్యంతో అలాంటి వ్యాఖ్యలు చేశారోగానీ.. వాతావరణం మాత్రం అలాగే కనిపిస్తోందని అభిప్రాయపడుతున్నారు కొందరు.కారణం ఏదైనాసరే.. రాష్ట్రంలో ఇంత పెద్ద ఘటన జరిగితే హోమ్ మంత్రి నోరు మెదపక పోవడం మాత్రం తీవ్ర చర్చనీయాంశం అయింది

# వై నాట్ 174 టీడీపీ నినాదమా...

శ్రీకాకుళం, జూలై 2, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన చింతకాయల విజయ్ తాజాగా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. నర్సీపట్నంలో తనకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ ని దమ్మున్న నాయకుడిగా కొనియాడారు. లోకేష్ తనది కాని నియోజకవర్గంలో టీడీపీకి అంతగా విజయావకాశాలు లేని సీట్లో గెలిచి చూపించారు అని విజయ్ గుర్తు చేశారు. మంగళగిరిలో ఒకసారి ఓటమి పాలు అయినా పట్టు వీడకుండా లోకేష్ మళ్లీ అదే స్థానం నుంచి గెలిచారు అంటే అదే లోకేష్ సత్తా అని అన్నారు. కానీ విపక్ష నేత జగన్ మాత్రం పులివెందుల దాటి బయటకు వచ్చి ఎక్కడైనా పోటీ చేసే సత్తా ఉందా అని విజయ్ ప్రశ్నించారు. జగన్ పులివెందులకు మాత్రమే పరిమితం అని విజయ్ ఎద్దేవా చేసారు. తెలుగుదేశం పార్టీకి సమర్థుడు అయిన నాయకుడు నారా లోకేష్ అని అన్నారు. ఆయన చేతుల్లోనే టీడీపీకి మంచి భవిష్యత్తు ఉందని విజయ్ అన్నారు. లోకేష్ నాయకత్వాన్ని ప్రతీ కార్యకర్త పూర్తి స్థాయిలో బలపరుస్తున్నారని కూడా విజయ్ చెప్పారు. లోకేష్ తన కుటుంబంగానే పార్టీలోని అందరినీ చూసుకుంటారు అని ఆయన తమ కుటుంబం మీద చూపించే అభిమానం ఆప్యాయతలు ఎంతో గొప్పవని అని విజయ్ చెప్పారు. ఇందుకు గానూ తాను లోకేష్ కి రుణపడి ఉంటాను అని విజయ్ చెప్పారు.టీడీపీ అధినేత చంద్రబాబు గురించి విజయ్ చెబుతూ ఆయనను నమ్ముకుంటే చాలు అందరికీ న్యాయం తప్పకుండా జరుగుతుందని అన్నారు. తాను మూడు సార్లు అనకాపల్లి ఎంపీ సీటు కోసం ప్రయత్నం చేశాను అని విజయ్ చెప్పారు. అయితే ఆ మూడు సార్లు నిరాశ ఎదురైంది అని అన్నారు. అయితే అదే సమయంలో చంద్రబాబు తనను పిలిచి నన్ను నమ్ము విజయ్ నీకు మంచి స్థానం ఇస్తాను అని చెప్పేవారు అని విజయ్ గుర్తు చేసుకున్నారు. ఇపుడు బాబు ఏకంగా తనకు రాజ్యసభ సీటు ఇచ్చి తన మాటను నిలబెట్టుకున్నారు అని బాబుకు సదా కృతజ్ఞతలు అని విజయ్ చెప్పారు. తమ కుటుంబానికి మొదటి నుంచి చంద్రబాబు ఆదరణ మద్దతు ఉందని విజయ్ చెప్పారు. తాను తెలుగుదేశం పార్టీకి జెండా కూలీగా పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. పార్టీ ఆదేశాలు తుచ తప్పకుండా పాటిస్తాను అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏ అన్యాయం జరిగినా తాను ముందు ఉంటాను అని విజయ్ హామీ ఇచ్చారు. తాను పార్టీ కోసం ఎంతైనా చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. నర్సీపట్నంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీగా తన వంతుగా కష్టపడి పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. నర్సీపట్నంలో సృష్టి క్షేత్రం పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానిస్తామని విజయ్ తెలిపారు. సృష్టి క్షేత్రంలో ప్రపంచంలోనే ఎత్తైన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను నెలకొల్పుతామని విజయ్ చెప్పారు. నర్సీపట్నంలో అభివృద్ధి పనులకు ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని విజయ్ స్పష్టం చేశారు. మొత్తానికి చూస్తే అయ్యన్నపాత్రుడు వారసుడిగా విజయ్ సింహ గర్జన చేశారు. రానున్న రోజుల్లో అయ్యన్న ప్లేస్ లో పూర్తి స్థాయి రాజకీయానికి విజయ్ సిద్ధపడుతున్నారు అనడానికి తాజా సభ ఒక నిదర్శనంగా చెబుతున్నారు.

# వీబీ--జీ రామ్--జీ పథకాన్ని అడ్డుకోవద్దు

## బీజేపీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 3 కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్ (VB-G RAM-G)లి పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి రాజకీయ వివాదాలకు తావు లేకుండా అమలు చేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి అంశాల కంటే పథకంపై న్యాయపరమైన చర్యలకే ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపించిందన్నారు. ఒకవైపు పథకాన్ని అమలు చేస్తామని, మరోవైపు కోర్టును ఆశ్రయిస్తామని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

దేశవ్యాప్తంగా ఈ పథకానికి రూ.95,800 కోట్ల నిధులు కేటాయించగా, తెలంగాణకు రూ.3,825 కోట్లకు పైగా నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలంటే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.పథకం ద్వారా గ్రామీణ ఉపాధి, జీవనోపాధి, వ్యవసాయ ఉత్పాదకత, సహజ వనరుల పరిరక్షణ, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతం లభిస్తుందని తెలిపారు. వేతనాలను నిర్ణీత గడువులో కార్మికుల ఖాతాల్లో జమ చేయడం, డిజిటల్ పర్యవేక్షణ ద్వారా పారదర్శకత పెంచడం, అవినీతిని అరికట్టడం వంటి సంస్కరణలు ఇందులో భాగమని పేర్కొన్నారు.గ్రామీణ పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా పథకాన్ని అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం వాటా నిధులను వెంటనే విడుదల చేసి గ్రామీణాభివృద్ధికి సహకరించాలని తాడూరి శ్రీనివాస్ కోరారు.

# టూ టైర్ సిటీస్ లో విల్లా కల్చర్

కాకినాడ, జూలై 3, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా స్థిరాస్తి మార్కెట్ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా స్థిరమైన వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. ముఖ్యంగా రాజమండ్రి రూరల్ పరిసర ప్రాంతాలతో పాటు కాకినాడ అచ్యుతాపురం ఎకనామిక్ జోన్ వైపు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పారిశ్రామిక విస్తరణ, మౌలిక వసతుల కల్పన వేగవంతం కావడంతో ఈ కారిడార్‌లోని ల్యాండ్ మార్కెట్ వైపు మదుపరులు భారీగా ఆకర్షితులవుతున్నట్లు ఈ వారం పత్రికల బిజినెస్ పేజీలు ప్రత్యేక విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించాయి.ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఇంతలా పుంజుకోవడానికి ప్రధాన బలం గోదావరి జిల్లాల్లోని సంపన్న వర్గాల నుంచి వస్తున్న పెట్టుబడులేనని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో అత్యంత లాభదాయకంగా సాగుతున్న ఆక్వా రంగానికి చెందిన ప్రముఖులు, స్థానిక పారిశ్రామికవేత్తలు తమకు వస్తున్న లాభాలను సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ మార్గంగా భావించి భూములపై పెడుతున్నారు. షేర్ మార్కెట్, ఇతర వ్యాపారాల కంటే స్థిరాస్తి రంగానికే దీర్ఘకాలంలో తిరుగులేని లాభాలు వస్తుండటంతో, వీరంతా గ్రూపులుగా ఏర్పడి మరీ కనెక్టింగ్ రోడ్ల వెంబడి వందల ఎకరాలను కొనుగోలు చేస్తున్నారు.రాజమండ్రి రూరల్ పరిధిలోని శాటిలైట్ సిటీ పరిసరాలు, కడియం, జేగురుపాడు వైపు వెళ్లే మార్గాలతో పాటు.. కాకినాడ నుంచి అచ్యుతాపురం సెజ్ కనెక్టివిటీ ఉన్న రహదారుల ఇరువైపులా కొత్త కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. డీటీసీపీ అనుమతులతో మౌలిక వసతులు కల్పిస్తూ రియల్టర్లు వేస్తున్న లేఅవుట్లకు హాట్ కేకుల్లా డిమాండ్ ఏర్పడింది.

## మర్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్పీకర్ ఆదేశాల మేరకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ తుమ్మల సురేష్ యాదవ్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 3 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు సీఎంఆర్ చెక్కులు మరుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది అని తెలిపారు మండలానికి సంబంధించి 66 మంది లబ్ధిదారులకు నిరుపేదలకు నేనున్నానంటూ ఆదుకున్న మన



కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి సర్కార్ పేదల పార్టీ మనం మర్చిపోకూడదని తెలిపారు మర్పల్లి మండల పరిధిలో దాదాపు 45 లక్షల రూపాయల చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు కార్యక్రమంలో పెద్దలు సుభాష్ యాదవ్ మర్పల్లి మండల సర్పంచ్ల అధ్యక్షులు మొహమ్మద్ రఫీ యో దిన్ మర్పల్లి సర్పంచ్ మధు గు రామేశ్వర్, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సురేష్ యాదవ్, దివాకర్, నరసింహులు యాదవ్, తుమ్మలపల్లి పాండు,వివిధ గ్రామాల సర్పంచులు సీనియర్ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పెద్ద ఎత్తున ఆరోగ్యమంలో పాల్గొని చెక్కులు తీసుకోవడం జరిగిందని తెలిపారు

## సత్తుపల్లిలో ప్రపంచ టూ వీలర్ మెకానిక్ దినోత్సవ వేడుకలు



**సత్తుపల్లి ప్రతినిధి జూలై03 ప్రజాబలం:**సత్తుపల్లిలో ప్రపంచ టూ వీలర్ మెకానిక్ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మోటార్ సైకిల్ మెకానిక్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు హకీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు తాళ్లూరి బాస్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మెకానిక్ సోదరులకు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా తాళ్లూరి బాస్కర్ మాట్లాడుతూ సమాజానికి నిరంతరం సేవలందిస్తున్న నిరుపేద మెకానిక్‌లను ప్రభుత్వం గుర్తించి వారికి ఇండ్ల స్థలాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన మెకానిక్ కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేక సహాయం అందించి వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ మెకానిక్‌లు ప్రసాద్, హోండా శ్రీను, బాజీ, శివ, మురళి, నిమ్మగడ్డ రవికుమార్, మీరా, రామకృష్ణ, రహీమ్, షంషేర్, శేఖర్ తదితరులు పాల్గొని ప్రపంచ టూ వీలర్ మెకానిక్ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

## రామగుండం అభివృద్ధికి ఎన్టీపీసీ సహకరించాలి : ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్



**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-3, ప్రజాబలం ప్రతినిధి :** రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ టి పి సి సంస్థ సహకరించాలని ఎం ఎల్ ఎ ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఎన్ టి పి సి అధికారులతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం మేయర్ మహంకాళి స్వామి , అదనపు కలెక్టర్, కమిషనర్ జె.అరుణ శ్రీ తో కలిసి వివిధ అంశాలపై సమీక్షించారు. ఎన్ టి పి సి సంస్థ సిఎస్ఆర్, సిడి నిధులను రామగుండం నియోజకవర్గంలోని ప్రభావిత ప్రాంతాలలో మాత్రమే ఖర్చు చేయాలని అన్నారు. కేవలం సిఎస్ఆర్ మాత్రమే కాకుండా రెగ్యులర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులలోనూ ఎన్ టి పి సి సంస్థ పాలుపంచుకోవాలని అన్నారు. ప్రభావిత ప్రాంతాలన్నీ దత్తత తీసుకొని ప్రజలకు అవసరమైన అన్ని మౌళిక వసతులు కల్పించాలని అన్నారు. రాజీవ్ రహదారిని ప్రమాద రహితంగా తీర్చిదిద్దడానికి ఎంఆర్ఓ కార్యాలయం నుండి గోదావరి బ్రిడ్జ వరకు నాలుగు ప్రాంతాల్లో ఆర్ఓబి లు నిర్మించడానికి ప్రతిపాదించామని అందులో రెండింటి నిర్మాణానికి ఎన్ టి పి సంస్థ ముందుకు రావాలని అన్నారు. అలాగే ఎంఆర్ఓ కార్యాలయం నుండి ఇల్లందు గెస్ట్ హౌజ్ వరకు సర్వీస్ రోడ్డు వెడల్పు ఉండేలా ఎన్ టి పి సి సంస్థ తమ ప్రహరీ గోడ వెనక్కు జరిపి నిర్మించుకోవాలని అన్నారు . శాలపల్లి రోడ్ లో సోలార్ ప్లాంట్ ప్రహరీ గోడ కూడా వెనక్కి జరిపి నిర్మించుకోవాలని అన్నారు. నగర పాలక సంస్థకు చెల్లించవలసిన భవన నిర్మాణ రుసుం చెల్లించి క్వార్టర్ ల నిర్మాణానికి అనుమతి పొందాలని అన్నారు. వర్షాకాలంలో వరద ముంపు ప్రమాదం రాకుండా ఎన్ టి పి సి వృధా నీరు ప్రవహిస్తున్న కాలువల్లో పూడిక తొలగింపు పనులు వేగిరశీ పూర్తి చేయలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , పలువురు కార్పొరేటర్లు నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులతో పాటు ఎన్ టి పి సి సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రవీణ్, ఏజిఎం (హెచ్ ఆర్) రంజాన్ సాహో , సిఎస్ఆర్ అధికారులు సూర్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గగుడిలో అర్చకులకు అడుగడుగునా అవమానం

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఏఈవో తీరుపై అర్చకస్వాములు, వేద పండితులు తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి కారణం లేకుండా ఏఈవో చంద్ర శేఖర్ తమను అసభ్యకరంగా దూషించి బెదిరిస్తున్నాడని వారు ఆరోపిస్తున్నారు. తీరు మార్చుకోకపోతే దేవస్థానంలో విధులు బహిష్కరిస్తామని అర్చకులు, వేదపండితులు హెచ్చరించారు... ఈ మేరకు ఏఈవోపై ఈవో క్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దేవస్థానంలో పొన్నపల్లి సత్యనారాయణమూర్తి అర్చక విభాగంలో కేర్‌టేకర్‌గా, వివిధ ఉత్సవాలలో, వేద పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆలయ వైదిక కమిటీ, ఈవో ఆదేశాల మేరకు ఇటీవల ఆయన్ను పోరంకిలోని వేద పాఠశాల నుంచి ఆలయంలో కుంకుమార్చన, పల్లకీసేవ, దర్బార్‌సేవలకు బదిలీచేశారు. జూన్ 30న సత్యనారాయణమూర్తి ఆలయంలో విధుల్లో ఉండగా ఏఈవో చంద్రశేఖర్ అతడి వద్దకు వెళ్లి ఇక్కడున్నావేంటి.. ఆర్డర్ ఉందా.. ఎవరిచ్చారు? అంటూ ప్రశ్నించడంతో సత్యనారాయణమూర్తి దేవస్థానం వైదిక కమిటీ, ఈవో ఇచ్చిన ఆర్డర్‌ను ఏఈవోకు చూపించాడు.

# స్వధార్ హోమ్ ఆశ్రయం తనిఖీ...



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 3(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారి ఆదేశాల ప్రకారం శు క్రవారం నాడు బీరంగూడ లోని స్వధార్ హోమ్ నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య తనిఖీ నిర్వహించటం జరిగినది,జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ




కార్యదర్శి తనిఖీ చేశారు,ఈ సందర్భంగా స్వధార్ హోమ్ ఆశ్రయంలో పొందుతున్న బాధిత మహిళలకు అందిస్తున్న వసతి, ఆహారం,వైద్య సేవలు, భద్రత, పరిశుభ్రత, కౌన్సెలింగ్ మరియు ఇతర సంక్షేమ సౌకర్యాలను పరిశీలించారు,బాధిత మహిళలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, మానసిక స్థితి, సమస్యలు మరియు అవసరాల గురించి తెలుసుకున్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు,అదేవిధంగా, బాధితుల హక్కులను పరిరక్షిస్తూ వారికి అవసరమైన న్యాయ సహాయం, కౌన్సెలింగ్ మరియు పునరావాస సేవలను అందించాలన్నారు,ఎవరికైనా న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం,సంగారెడ్డిని సంప్రదించగలరు అని అన్నారు.

## మాతృ మరణాల నివారణకు వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూలై 03, ప్రజాబలం ప్రతినిధి :** జిల్లాలో మాతృ మరణాలుసంభవించకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గర్భిణీలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. శు క్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి మాతృ మరణాల సమీక్షా



సమావేశాన్ని నిర్వహించారు.?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత సంవత్సరంలో జరిగిన మాతృ మరణాల వంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. మాతృ మరణాల సంఖ్య సున్నాగా ఉండేలా క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, హై-రిస్క్ కేసులను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించాలని తెలిపారు. గర్భిణీలు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు పొందేలా వైద్యశాఖ సిబ్బంది ఆ చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్న వసతులు, సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. ?వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, గర్భిణీలకు అవసరమైన వైద్య సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ?ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పవిత్ర, డీసీహెచ్ఎస్ శ్రీధర్, ఇతర వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మావిగన్ అయితే... విశాఖ సంగతేంటీ

విశాఖపట్టణం జూలై 3,విశాఖ మన రాజధాని అని వైసీపీ అధినేత జగన్ గతంలో చెప్పారు. తాను 2024లో మరోసారి గెలిస్తే విశాఖ నుంచే ప్రమాణం చేస్తాను అని కూడా చెప్పారు. విశాఖలో అన్నీ ఉన్నాయి అది సహజసిద్ధమైన రాజధాని అని వైసీపీ నేతలు పలు మార్లు చెప్పుకొచ్చారు. అయితే 2024 ఎన్నికల్లో చేదు ఫలితాలు దక్కిన తరువాత కానీ వైసీపీ నేతలకు తత్వం బోధపడలేదని అంటున్నారు. అందుకే కొన్నాళ్ళ పాటు సైలెంట్ గా ఉండి ఇపుడు దాదాపుగా టీడీపీ రూట్లోనే వెళ్తున్నారు అని అంటున్నారు. టీడీపీ కూడా అమరావతి రాజధాని అన్నది. విజయవాడ గుంటూరులకు దూరంగా కొత్త నగరం నిర్మించే పనిలో టీడీపీ ఉంది. అయితే వైసీపీ మాత్రం రెడీ మేడ్ గా మావిగన్ అని అంటోంది. అంటే విశాఖకు బదులుగా మావిగన్ తెచ్చినా రెడీ మేడ్ సిటీ విషయంలో మాత్రం వైసీపీ పక్కకు జరగలేదు అన్నది స్పష్టం అవుతోంది. ఇక విశాఖ రాజధాని అన్నారు. బీచ్ రోడ్డులో రుషికొండ మీద టూరిజం రిసార్ట్స్ ని తొలగించి అక్కడ సీఎం క్యాంప్ ఆఫీసు అని నివాసం అని దాని పేరుతో భారీ భవనాలు కట్టారు. నాలుగు వందల కోట్ల రూపాయలు దాని కోసం ఖర్చు చేశారు. విశాఖలో సముద్రం ఉంది, రైల్ రోడ్డు ఎయిర్ కనెక్టివిటీ ఉందని కూడా చెప్పారు. ఉత్తరాంధ్రా వెనకబాటుతనం అంతా పోయేలా విశాఖ క్యాపిటల్ ద్వారా అభివృద్ధి సాగుతుందని కూడా ప్రకటించారు. కానీ ఇపుడు విశాఖను వెనక్కి తీసుకున్నారు. ఆశ పెట్టి తగ్గిపోయారు అని అంటున్నారు. మరి దీని మీద ఉత్తరాంధ్రా వైసీపీ నేతల రియాక్షన్ ఎలా ఉంటుంది అన్నది కూడా చర్చకు వస్తోంది. ఇక విశాఖ రాజధాని అన్నపుడు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటి వారు గట్టిగా సమర్ధించారు. మా ప్రాంతం బాగు పడవద్దా అని కూడా ప్రశ్నించారు. మాకు రాజధాని వస్తూంటే టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు అని కూడా విమర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అలాగే బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా విశాఖ రాజధానికి జై కొట్టారు. మరి ఇపుడు వైసీపీ అయితే మావిగన్ అని తన రూట్ మార్చి ప్లేట్ తిప్పేసింది. దాంతో ఈ మాజీ మంత్రులు ఇంకా వైసీపీలోని కీలక నేతలు సీనియర్ నేతలు ఏమంటారు అని ప్రశ్నలు వస్తున్నాయి. అలాగే విశాఖ రాజధాని అని వైసీపీ నేతలు ఎంత గట్టిగా చెప్పినా మరెంత ఆర్భాటం చేసినా జనాల మద్దతు అయితే ఏ కోశానా లేదని తేలిపోయింది. విశాఖ రాజధాని అన్న తరువాతనే 2023లో ఉత్తరాంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే ప్రజలు యువత ఉద్యోగులు విద్యావంతులు అంతా కలసి టీడీపీకే ఓటేశారు. ఆ తరువాత 2024లో విశాఖ జిల్లా మొత్తం ఒక్క సీటూ వైసీపీకి లేకుండా చేశారు. ఇంతే కాదు గత అయిదేళ్లలో వైసీపీ విశాఖ రాజధాని అని ఎంతగా చెప్పినా జనాల నుంచి పాజిటివ్ రియాక్షన్ అయితే పెద్దగా రాలేదని గుర్తు చేస్తున్నారు. అందుకే వైసీపీ కూడా తన నిర్ణయం మార్చేసుకుంది అని అంటున్నారు. అయితే చెప్పుకోవడానికి ఈ రీజన్ బాగుంది కానె విశాఖ సహా ఉత్తరాంధ్రా అభివృద్ధి మీద వైసీపీ చిత్తశుద్ధి ఇంతేనా అన్న చర్చ కూడా మరో వైపు సాగుతోంది.

# గనుల్లో రెస్క్యూ సిబ్బంది భద్రతా అవగాహన సదస్సు



పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-3, ప్రజాబలం ప్రతినిధి : జీడీకే-1, 3 ఇంక్లైన్ గనిలో రెస్క్యూ సిబ్బంది ఆధ్వర్యంలో భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూగర్భ గనులలో సంభవించే అత్యవసర పరిస్థితులు, గ్యాస్ మరియు విషవాయువుల లీకేజీలు, విద్యుత్ ప్రమాదాలు, గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల సమయంలో తీసుకోవాల్సిన కార్మికులకు అగ్నిమాపక యంత్రాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. మండుతున్న మంటలను అగ్నిమాపక పరికరంతో ఆర్పే విధానాన్ని ఆచరణాత్మకంగా



చూపించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రెస్క్యూ బృందం వివరించింది. ఇలాంటి అవగాహన కార్యక్రమాల వల్ల గనిలో పని చేసే కార్మికుల్లో భద్రతా స్పృహ పెరుగుతుందని, అత్యవసర సమయంలో సరైన చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడుతుందని కార్మికులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించేందుకు ఉపయోగపడే సీపీఆర్ విధానాన్ని డమ్మీ మానవ నమూనా సహాయంతో ప్రత్యక్షంగా ప్రదర్శించి శిక్షణ ఇచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే సరైన ప్రథమ చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని రెస్క్యూ నిపుణులు వివరించారు. అనంతరం గనుల భద్రత, ప్రమాదాల నివారణ మరియు సురక్షిత విధానాల పాటింపుపై రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జీడీకే-1, 3 ఇంక్లైన్ మేనేజర్ సుధీర్ జక్కుల్ వార్, సేఫ్టీ ఆఫీసర్ జి.మహేష్, నూతి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి, పిట్ ఇంజనీర్ శేఖర్ మరియు సూపర్ వైజర్స్, రెస్క్యూ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# దేశ ఆరోగ్యరంగంలో కొత్త అధ్యాయం... ఆస్టర్ క్వాలిటీ కేర్ కార్యకలాపాల ప్రారంభం

## మెట్రో నగరాలకే కాదు... చిన్న మధ్య తరహా నగరాలకూ అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యం ఆస్టర్ క్వాలిటీ కేర్

హైదరాబాద్ జూలై 3: ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్, క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ విలీనం పూర్తికావడంతో ఏర్పడిన ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ జూలై 1 నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ విలీనంతో ఆస్టర్ డీఎం , కేర్ హాస్పిటల్స్ , ఎవర్‌కేర్, కిమ్స్‌హెల్త్ అనే నాలుగు ప్రముఖ ఆరోగ్య సంస్థలు ఒకే గొడుగు కిందకు వచ్చాయి.



ఈ విలీనం రెండు సంస్థల కలయిక మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయి వైద్య సేవలు, నిపుణుల చికిత్స, అత్యాధునిక వైద్య సాంకేతికతను మరింత మందికి అందుబాటులోకి తీసుకురావాలనే ఉమ్మడి లక్ష్యంతో ఈ సంస్థ ముందుకు సాగుతోంది. కొత్త సంస్థకు డాక్టర్ అజాద్ మూఫెన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగుతుండగా, వరుణ్ ఖన్నా మేనేజింగ్ డైరెక్టర్, గ్రూప్ సీఈఓగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

విలీన సంస్థ కార్యకలాపాల ప్రారంభం సందర్భంగా ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ అజాద్ మూఫెన్ మాట్లాడుతూ, “ఆస్టర్, క్వాలిటీ కేర్ ఒకే సంస్థగా మారడం మా ప్రయాణంలో కీలక ఘట్టం. ఇది రెండు ఆసుపత్రుల నెట్‌వర్క్‌లు కలవడం మాత్రమే కాదు. ఒకే విలువలు, నాణ్యమైన వైద్యం, అనుభవజ్ఞులైన వైద్యులు, రోగుల పట్ల నిబద్ధత కలిగిన రెండు సంస్థలు కలిసి మరింత బలమైన ఆరోగ్య వ్యవస్థను నిర్మిస్తున్నాయి. భవిష్యత్‌లో భారతదేశ ఆరోగ్య అవసరాలను మరింత సమర్థంగా తీర్చగల సంస్థగా ఎదుగుతాం” అని తెలిపారు.

ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ మేనేజింగ్ డైరెక్టర్, గ్రూప్ సీఈఓ వరుణ్ ఖన్నా మాట్లాడుతూ, “ఈ విలీనంతో ఒకదానికొకటి బలంగా తోడ్పడే రెండు ఆరోగ్య సంస్థలు ఒకటయ్యాయి. ప్రతి నిర్ణయంలో రోగులు, వారి కుటుంబాల ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇస్తాం. డిజిటల్ సాంకేతికతను మరింతగా వినియోగిస్తూ నాణ్యమైన వైద్య ఫలితాలపై దృష్టి పెడతాం. ప్రస్తుతం రోగుల చికిత్సకు ఎలాంటి అంతరాయం కలగకుండా విలీన ప్రక్రియను సజావుగా పూర్తి చేయడమే మా మొదటి లక్ష్యం. వైద్యులు, ఉద్యోగులు, భాగస్వాములు, రోగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ మార్పును అనుభవించేలా చర్యలు తీసుకుంటున్నాం” అని చెప్పారు.

# లోకల్ బాడీ ఎలక్షన్స్ గురి...

విజయవాడ, జూలై 2, వైసీపీ అధినేత జగన్ పార్టీ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా పార్టీపరంగా కొన్ని దిశానిర్దేశాలు చేస్తున్నారు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికలకు సంబంధించి కూడా వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభవం తిరిగి తీసుకురావాలన్నదే జగన్ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న. ఎందుకంటే.. ఎవరు అధికారంలో ఉంటే వారే స్థానికంగా విజయం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అసలు పోటీ నుంచే తప్పుకొంది. అయినా.. కొందరు టీడీపీ నాయకులు పోటీ చేశారు. ఇక, ఇప్పుడు వైసీపీ స్థానికంలో అయినా.. గెలుపు గుర్రం ఎక్కి.. విజయం దక్కించుకుని గత ఎన్నికల్లో జరిగిన పరాభవం నుంచి బయట పడేందుకు ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వంపై ఉన్న సానుకూలత వైసీపీకి కలిసి వచ్చేలా లేదు. పింఛన్ల పంపిణీ నుంచి గ్రామీణ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి వంటివి వైసీపీకి వ్యతిరేకతను కొనసాగిస్తున్నాయి. నాడు వైసీపీ పనులు చేసి ఉంటే ఇప్పుడు చెప్పుకొనేందుకు అవకాశం ఉండేదని కూటమి నాయకులు కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఈ ఎఫెక్ట్ ఎక్కువగా పడే ప్రభావం ఉందని అంటున్నారు. దీనికితోడు క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య ఐక్యత కూడా కనిపించడం లేదు. జగన్ రావాలి.. పార్టీని పట్టించుకోవాలని అనే నాయకుల సంఖ్య ఎక్కువగా ఉందే తప్ప.. వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుని ముందుకు సాగాలన్న లక్ష్యంతో నాయకులు ముందుకు కదలడం లేదు.

# ఆహార భద్రతపై రాజీలేని పర్యవేక్షణ అవసరం

## (సి.హెచ్.ప్రతాప్)

తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి ఆహార కేంద్రాలు వేగంగా పెరుగుతున్నాయి. ప్రతిరోజూ లక్షలాది మంది బయట ఆహారం తీసుకుంటున్న నేపథ్యంలో ఆహార భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవలి కాలంలో ఆహార భద్రతా అధికారుల తనిఖీల్లో గడువు ముగిసిన ఆహార పదార్థాలు, అపరిశుభ్రమైన వంటగదులు, పురుగుల సమస్య, నాసిరకం నూనెల వినియోగం, కృత్రిమ రంగులు, నిబంధనలకు విరుద్ధంగా ఆహార నిల్వ వంటి లోపాలు వెలుగులోకి రావడం ప్రజారోగ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. లాభాపేక్షతో వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహిస్తున్న ప్రత్యేక తనిఖీలు స్వాగతించదగ్గ చర్య. అయినప్పటికీ అప్పుడప్పుడు జరిగే దాడులతో మాత్రమే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. నిరంతర పర్యవేక్షణ, శాస్త్రీయ పరీక్షలు, పారదర్శక తనిఖీ వ్యవస్థ, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలి. ప్రతి హోటల్, రెస్టారెంట్‌లో పరిశుభ్రత రేటింగ్‌ను వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించడం తప్పనిసరి చేయాలి. నిబంధనలను పదేపదే ఉల్లంఘించే సంస్థల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు తగిన జరిమానాలు విధించాలి.

ఆహార పదార్థాల కొనుగోలు నుంచి నిల్వ, తయారీ, వడ్డింపు వరకు ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా సంబంధిత శాఖలు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. హోటల్ యాజమాన్యాలకు పరిశుభ్రత, ఆహార భద్రతపై తరచూ శిక్షణ ఇవ్వాలి. వినియోగదారులు కూడా ఆహార నాణ్యతపై అప్రమత్తంగా ఉండి లోపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసే అలవాటు పెంపొందించుకోవాలి.

ఆహారం కేవలం ఆకలి తీర్చే సాధనం మాత్రమే కాదు; అది ప్రజారోగ్యానికి పునాది. హైదరాబాద్ వంటి మహానగరంలో సురక్షితమైన ఆహార వ్యవస్థ ఏర్పడటం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అత్యవసరం. కఠినమైన అమలు, నిరంతర తనిఖీలు, పారదర్శక విధానాలు, ప్రజల అప్రమత్తత సమన్వయంతోనే తెలంగాణలో ఆదర్శవంతమైన ఆహార భద్రతా వ్యవస్థను నెలకొల్పడం సాధ్యమవుతుంది..

# భారతదేశం లో ప్రజ్వరిల్లుతున్న సనాతన ధర్మం

## బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి



హైద్రాబాద్ జులై 3; పడకండి నరసింహ చారి శ్రీపతి వనజ పుత్రిక లాస్య సారి ఫంక్షన్ మరియు కుమారుడు వరుణ్ దమ్మాయిగూడ లో రంగ రంగ వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారిరి హాజరై భారతదేశం లో సనాతన ధర్మాన్ని తల్లిదండ్రులను గౌరవించే సాంప్రదాయాన్ని ఒక భారతదేశంలో మాత్రం ఉన్నది ఇలాంటి దేశంలో పుట్టడం మనందరి అదృష్టంగా భావించాలి పడకంటి సత్యనారాయణ చారి తాత కీర్తిశేషులు పడకండి సుగుణమ్మ అమ్మాయి తల్లిదండ్రులు జి అనంత చారి అమృత ఆశీర్వాదంతో రంగ రంగ వైభవంగా ప్రోగ్రాం ఏర్పాటు చేశారు పిల్లలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పైడిముంతల శంకరాచారి లావణ్య వారి కాకా మణెమ్మ అమ్మాయికి ఇంకో తాత పడకంటి ఓంకార చారి సువర్ణ బ్రహ్మండచారి విశ్వబ్రాహ్మణ రాష్ట్ర నాయకులు నాగభూషణ చారి బ్రహ్మచారి వెంకన్న కుందారం అనిల్ కుమార్ స్రవంతి కుందారం జ్ఞానోదర హారిక కుందారం జయలక్ష్మి లక్ష్మి తదితరులు పాల్గొని నూతన వధూవరును ఆశ్రయించడమైనది కుందారం గణేష్ మాట్లాడుతూ మానవుని మనిషిని సనాతన ధర్మ ప్రకారం గా ఆదరించి అభిమానించే గుణం కేవలం భారతీయులకు మాత్రమే ఉన్నది ఇలాంటి భారత దేశంలో పుట్టడం జాతికే గర్వకారణం విశ్వబ్రాహ్మణుల జాతర పుట్టడం మా అందరి అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. శ్రీనివాస్ చారి గారు తెలియజేశా

# వరంగల్పోలీస్కమిషనర్శ్వేతా రెడ్డిని కలిసిన రాజనాల



వరంగల్ జులై 3 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో

కొత్తగా వచ్చిన పోలీస్ కమిషనర్‌చీ, శ్వేతా రెడ్డి ని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్

రాజనాల శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనాలు తెలిపారు. 20 సంవత్సరాల తర్వాతవరంగల్లో మళ్ళీ పోలీస్ కమిషనర్ గా రావడం సంతోషంగా ఉందని ఆమెకు అంత శుభం జరగాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నాను రాజనాల శ్రీహరి తో పాటు వెల్ది ప్రభాకర్ గోపగోని అఖిలు తదితరులు పాల్గొన్నారు

# పరిశ్రమల మనుగడకు పటిష్ట నీటి నిర్వహణే కీలకం -- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి



హైద్రాబాద్ జులై 3 : పరిశ్రమల స్థాపనతో పాటు పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల కాపాడుకోవడమే తెలంగాణ ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ‘ది పార్క్’ హోటల్‌లో గురువారం జరిగిన “నీటి భద్రత – పారిశ్రామిక స్థిరత్వం” ఉన్నత స్థాయి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, నీటి భద్రత లేకపోతే శాశ్వత పారిశ్రామిక వృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే ప్రతి పారిశ్రామిక పార్కులోనూ జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానాన్ని, అధునాతన మురుగునీటి శుద్ధి ప్లాంట్లను తప్పనిసరి చేస్తామని వెల్లడించారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యత (జూ=) నిధులను స్థానిక చెరువుల పునరుద్ధరణకు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వసతుల మెరుగుదలకు కేటాయించాలని ఆమె పిలుపునిచ్చారు.

భూగర్భ జలాలు పడిపోతున్న ప్రస్తుత తరుణంలో పరిశ్రమలు ఐఓటీ (×శీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) వంటి స్మార్ట్ సాంకేతికతను ఉపయోగించుకుని నీటి వృధాను, లీకేజీలను అరికట్టాలని సదస్సులో పాల్గొన్న నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 100 మందికి పైగా పారిశ్రామిక ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు మరియు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొని పారిశ్రామిక నీటి నిర్వహణపై విస్తృతంగా చర్చించారు.

# ట్రాఫిక్ మేనేజ్మెంట్‌లోకి 'మేఘా' గ్రూప్

హైదరాబాద్, జూలై 3, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ , అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం అనలాగ్ సంస్థతో కలిసి సాంకేతిక రంగంలోకి సంచలన ఎంట్రీ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం.. ఈ రెండు సంస్థలు కలిపి 50:50 భాగస్వామ్యంతో ఒక సరికొత్త జాయింట్ వెంచర్ ను ఏర్పాటు చేశాయి. భారతదేశంలోనే మొదటిసారిగా 'ఫిజికల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను తీసుకురావడానికి రాబోయే 3 నుండి 5 ఏళ్లలో దాదాపు రూ. 2,500 కోట్ల నుండి రూ. 4,000 కోట్లు భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు మేఘా ఎండీ పి. వి. కృష్ణా రెడ్డి అధికారికంగా ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీకి, ముఖ్యంగా భారీ వర్షాల సమయంలో తలెత్తే రోడ్డు దిగ్బంధనాలకు చెక్ పెట్టేందుకు మేఘా-అనలాగ్ సంయుక్త భాగస్వామ్యం ఒక పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్ట్‌లో మేఘా పాత్ర అత్యంత కీలకం కానుంది. నగరంలోని సుమారుగా అన్ని ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లను ఒకే తాటిపైకి తెస్తూ యూనిఫైడ్ ఇంటెలిజెంట్ సిస్టమ్ నెట్‌వర్క్‌ను క్షేత్రస్థాయిలో మేఘా గ్రూప్ నిర్మించనుంది. అనలాగ్ సంస్థ అందించే ఏఐ సాఫ్ట్‌వేర్, హైవ్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా.. రోడ్లపై రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సిగ్నల్ టైమింగ్స్‌ను డైనమిక్‌గా మార్చే అత్యాధునిక హార్డ్‌వేర్, సెన్సార్లు, కెమెరాల గ్రిడ్‌ను హైదరాబాద్ వ్యాప్తంగా మేఘా తన ఇంజనీరింగ్ నైపుణ్యంతో ఇన్స్టాల్ చేయనుందిఈ సరికొత్త ఏఐ సాంకేతికత పనితీరును పరీక్షించడానికి మేఘా-అనలాగ్ ఇప్పటికే హైదరాబాద్ నగరంలో క్షేత్రస్థాయి ట్రయల్స్ ప్రారంభించింది. తెలంగాణ సచివాలయం చుట్టూ ఉన్న 5 కిలోమీటర్ల పరిధిలోని అత్యంత కీలకమైన అంతర్గత మార్గాలలో ఒక పైలట్ ప్రాజెక్ట్‌ను మేఘా గ్రూప్ రన్ చేస్తోంది. ఈ పరిధిలో ఏఐ అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్స్ ఎలా స్పందిస్తున్నాయి? వర్షాలు పడినప్పుడు నీటి నిల్వలను సెన్సార్లు ఎంత త్వరగా గుర్తిస్తున్నాయి? అనే అంశాలపై డేటాను సేకరిస్తున్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో, దీనిని పూర్తిస్థాయిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధి అంతటా విస్తరించడానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీని ద్వారా అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్ల కోసం ఆటోమేటిక్ 'గ్రీన్ కారిడార్' రూట్ క్లియరెన్స్ సిస్టమ్‌ను కూడా మేఘా అందుబాటులోకి తేనుంది. ఈ భారీ భాగస్వామ్యం కేవలం హైదరాబాద్ రోడ్లపై ట్రాఫిక్ సిగ్నల్స్ మార్చడానికే పరిమితం కావడం లేదు. తాము దేశవ్యాప్తంగా నిర్మిస్తున్న పవర్ గ్రిడ్స్, భారీ ఇరిగేషన్ ప్రాజెక్టుల మెయింటెనెన్స్, వాటర్ సప్లై సిస్టమ్స్‌లో కూడా ఈ ఫిజికల్ ఇంటెలిజెన్స్ ను వాడుతామని మేఘా సంస్థ వెల్లడించింది. నగరాల్లో భూగర్భ తాగునీటి పైప్‌లైన్లలో జరిగే లీకేజీలను ముందే గుర్తించడం, విద్యుత్ లోడ్‌ను బట్టి పంపిణీని ఆప్టిమైజ్ చేయడం, అలాగే తాము తయారు చేస్తున్న ఓలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను కూడా ఈ ఏఐ నెట్‌వర్క్‌తో అనుసంధానించనున్నారు.

# టీచర్లకు బ్రేక్ ఫాస్ట్...లంచ్

హైదరాబాద్, జూలై 3, తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బందికి కూడా బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు విద్యార్థులకు మాత్రమే ఈ టిఫిన్స్, లంచ్ ఉచితంగా అందిస్తుండగా.. ఇక నుంచి టీచర్లు, లెక్చరర్లకు కూడా అందించనున్నారు. సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయానికి తాజాగా మంత్రివర్గం కూడా ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు.. ఆకలితో అలమటించకుండా ఉండేందుకు గత ప్రభుత్వాలు.. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా తీసుకువచ్చింది. అంతేకాకుండా ఇంటర్ విద్యార్థులకు కూడా ఈ బ్రేక్‌ఫాస్ట్, మిడ్ డే మీల్స్ పథకాలను ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలతోపాటు కాలేజీల్లో చదివే విద్యార్థులకు రెండు పూటలా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా రేవంత్ రెడ్డి సర్కార్ మరో కీలక నిర్ణయానికి తెరతీసింది. ఇక నుంచి విద్యార్థులకు మాత్రమే కాకుండా స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో పిల్లలకు చదువు చెప్పే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి కూడా ఈ మధ్యాహ్న భోజన పథకంతోపాటు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న తెలంగాణ తొలి ఈ-కేబినెట్ భేటీలో విద్యా రంగానికి సంబంధించి ఈ చారిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. ఈ నిర్ణయంతో ఇప్పటినుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు.. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బంది అందరికీ ఫ్రీగా ఉదయం అల్పాహారం.. మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఇప్పటివరకు గవర్నమెంట్ స్కూళ్లలో కేవలం విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం.. కొన్నిచోట్ల సీఎం అల్పాహార పథకం అమలు అవుతుండగా.. దాన్ని ఉపాధ్యాయులకు కూడా విస్తరించనున్నారు. తెలంగాణ కేబినెట్ తీసుకున్న తాజా నిర్ణయంతో విద్యాసంస్థల్లో టీచర్లు, లెక్చరర్లు మరికొంత ఎక్కువ సమయం గడపడానికి.. విద్యార్థులకు మరింత అందుబాటులో ఉండేందుకు వీలు కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు, విద్యా రంగ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మాజీ డీజీపీలకు సెక్యూరిటీ తగ్గింపు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగింపు

హైదరాబాద్, జూలై 3, భద్రతా ఏర్పాట్ల విషయంలో తెలంగాణ పోలీస్ శాఖ కీలక మార్పులు చేసింది. మాజీ డీజీపీలు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారులు, ప్రస్తుతం కీలక బాధ్యతల్లో ఉన్న పలువురు పోలీసు అధికారులకు కేటాయించిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, ఎస్కార్ట్ వాహనాలను ఉపసంహరించుకుంది. అలాగే పలువురు వీఐపీలు, అధికారులకు ఉన్న గన్‌మెన్ల సంఖ్యను కూడా తగ్గించింది. ఇంటెలిజెన్స్ నివేదికలు, రాష్ట్రంలో మారిన భద్రతా పరిస్థితులు, ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ పోలీస్ శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. పలువురు మాజీలు, రిటైర్డ్, కీలక ఉన్నతాధికారులకు భద్రత, వాహనాలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సెక్యూరిటీ రివ్యూ చేపట్టిన అధికారులు.. ఈ నిర్ణయానికి ఆమోదం తెలిపారు. మాజీ డీజీపీలు, రిటైర్డ్ ఐపీఎస్‌లు, కీలక పదవుల్లో ఉన్న ఉన్నతాధికారులకు ఇప్పటివరకు కల్పిస్తున్న బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, ఎస్కార్ట్ వాహనాలను తొలగిస్తూ.. పోలీస్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో కొంతమంది అధికారులు, మాజీ అధికారులకు సెక్యూరిటీని కూడా తగ్గించింది. ఏకంగా 100 మంది అధికారులకు సెక్యూరిటీ, వాహనాలను తగ్గించినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో మాజీ డీజీపీలు స్వరజిత్ సేన్, ఏకే ఖాన్, ఏకే మహంతి, దినేష్ రెడ్డి, జితేందర్, మహేందర్ రెడ్డి, అనురాగ్ శర్మతో పాటు పూర్ణచందర్‌రావు, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, నవీన్ చంద్, డానియల్, వెంకట్రామిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, డీటీ నాయక్, ఉమేష్ షరీఫ్, రవి గుప్తా వంటి మాజీ ఉన్నతాధికారులకు వాహనాలను తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌తో పాటు కొంతమంది ప్రస్తుత ఉన్నతాధికారులు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు కూడా ఈ మార్పులు వర్తించనున్నాయని పేర్కొన్నారు. బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలతో పాటు మాజీ డీజీపీలకు కేటాయించిన ఎస్కార్ట్ వాహనాలను కూడా వెనక్కి తీసుకోవాలని తెలంగాణ పోలీస్ శాఖ నిర్ణయించింది. మరోవైపు.. పలువురు రాజకీయ నాయకులు, మాజీ ఉన్నతాధికారులకు కేటాయించిన గన్‌మెన్ల సంఖ్యను కూడా తగ్గించారు. ఎక్కువ మందికి 1+1 భద్రతా విధానం (ఒక వ్యక్తిగత భద్రతా సిబ్బంది, ఒక డ్రైవర్/సహాయకుడు) మాత్రమే కొనసాగించేలా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. తెలంగాణలో నక్సలిజం ప్రభావం భారీగా తగ్గిపోవడం.. ఇంటెలిజెన్స్ బ్యూరో ఇచ్చిన తాజా భద్రతా నివేదికలు.. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం వంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వంద మందికి పైగా వీఐపీలకు కల్పిస్తున్న భద్రతను సమీక్షించి.. అవసరమైన వారికి మాత్రమే స్పెషల్ సెక్యూరిటీని కొనసాగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అయితే.. ఈ నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతిపక్ష నేతలు, మాజీ పోలీస్ ఉన్నతాధికారులను టార్గెట్‌గా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం వారికి భద్రతను తగ్గిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కేటాయించిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోగా.. ఈ నిర్ణయాన్ని ఆయన తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. వారం రోజుల పాటు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని తొలగించవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

## స్కూల్ బస్సులో మంటలు, విద్యార్థులు సురక్షితం

పల్నాడు రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం స్కూల్ బస్సులో ప్రమాదం తప్పింది. నరసరావుపేటకు చెందిన కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు కర్లకుంట గ్రామానికి విద్యార్థులను తీసుకురావడానికి వెళ్లి తిరిగి వస్తుండగా, బస్సులోని ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా దట్టమైన పొగతో పాటు మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును ఆపి, అందులో ఉన్న విద్యార్థులను సురక్షితంగా కిందికి దించాడు. అనంతరం స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

# రైలు కిందపడి దంపతుల ఆత్మహత్య



హైదరాబాద్ కుంట్లూర్ ప్రాంతంలో నివాసం ఉండే రవికుమార్, శిరీష దంపతులు శుక్రవారం నాడు ఘట్కేసర్ పరిధిలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు దంపతులు వరంగల్ ప్రాంతానికి చెందిన వారని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు.

## యూట్యూబర్ ప్రశ్న రావణ్ అరెస్ట్

మచిలీపట్నం, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో యూట్యూబర్ ప్రశ్న రావణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జనసేన నాయకులు అందించిన ఫిర్యాదు మేరకు శుక్రవారం తెల్లవారుజామున ఆయనను అదుపులోకి తీసుకుని మచిలీపట్నం సమీపంలోని ఇనకుదురు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన నేపథ్యంలో ఇనకుదురు పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్టేషన్ గేట్లను మూసివేసి, భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై ప్రశ్న రావణ్ చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం 31వ డివిజన్ జనసేన ఇన్‌చార్జి ఉడుముల బుజ్జి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రశ్న రావణ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# మంగళగిరి నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులకు మంత్రి లోకేష్ శంకుస్థాపన

**నూతన యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి**
**వాహనశాల, గంటా మండపం పునర్నిర్మాణం**
**శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణకు భూమిపూజ**
**రూ.6.3 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి లోకేష్**

మంగళగిరి: ప్రముఖ పుణ్యక్షేత్రం మంగళగిరి దిగువ సన్నిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం



ఆలయంలో నూతన యాగశాల నిర్మాణంతో పాటు వాహనశాల, గంటా మండపం పునర్నిర్మాణం, శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆలయ అధికారులు ఏర్పాటుచేసిన నమూనా చిత్రాలను పరిశీలించారు. అనంతరం శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారిని, రాజ్యలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వచనం చేసిన స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

రూ. 6.3 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

దేవాదాయ శాఖ నిధులు రూ. 6.3 కోట్ల వ్యయంతో శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణతో పాటు యాగశాల, గంటా మండపం, వాహనశాల పునర్నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా దేవాలయం మొత్తం కలియతిరిగిన మంత్రి నారా లోకేష్ అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు కావాల్సిన వసతులు, ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆలయ సాంప్రదాయాలకు అనుగుణంగా ఆయా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కల్పించడంతో పాటు నిత్యప్రసాదానికి చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరిణిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అందరితో కలిసి ఫోటోలు దిగారు.

## పద్మారావునగర్ దోపిడి కేసు లో నలుగురు అరెస్టు

సికింద్రాబాద్. ఐదు రోజుల క్రితం పద్మారావు నగర్ లో జరిగిన చోరీ కేసును చిలకలగూడ పోలీసులు ఛేదించారు. నలుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసారు. దోపిడీకి ఉపయోగించిన షట్టర్ కటింగ్ పరికరాలు, ఆయుధాలు, వాహనాలు స్వాదీనం చేసుకున్నట్లు ఏసీపీ శశాంక్ రెడ్డి వెల్లడించారు. జ్యోతి మెడికల్ హాల్ పెంట్ హౌస్ లో పెద్ద మొత్తంలో నల్లధనం ఉన్నదని దోచుకోవడం కోసం 15రోజుల క్రితమే ప్రణాళిక ముఠా వేసింది. ఆదివారం తెల్లవారు జామున ప్రణాళిక ప్రకారం దోపిడీ చేసింది. సెక్యూరిటీ గార్డులను తాళ్లతో బందించడంతో పాటు కత్తులతో బెదిరించింది. షట్టర్ కటింగ్ యంత్రాలతో దుండగులు షట్టర్ తాళాలు పగులగొట్టారు. షట్టర్ లోపల ? 27,500 నగదుతో పాటు, సెక్యూర్టీ సిబ్బంది దగ్గర ఉన్న ?2500 నగదు దోపిడీ చేసారు. ప్రధాన నిందితుడు సాయి తో పాటు మిగతా నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.

## గ్యాస్ ట్యాంకర్లో లీకేజీ.. క్షణాల్లోనే మంటలు

లక్నో ఉత్తరప్రదేశ్లోని కౌశాంబి టోల్ ప్లాజా వద్ద ఒక గ్యాస్ ట్యాంకర్లో ఒక్కసారిగా గ్యాస్ లీకై క్షణాల్లో భారీ మంటలు చెలరేగాయి. ట్యాంకర్ అగ్నిగోళంగా మారింది. భయానక దృశ్యాలు అక్కడ ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. దట్టమైన పొగ, మంటలు వాహనాన్ని చుట్టుముట్టడంతో టోల్ ప్లాజా సిబ్బందితో పాటు సమీపంలోని వాహనదారులు, డ్రైవర్లు ప్రాణభయంతో పరుగులు తీశారు.

## బిర్యానీ కోసం ఎగబడ్డ జనం

హనుమకొండలో హోటల్ ప్రారంభోత్సవం సందర్భంగా 300 ఉచిత బిర్యానీ ప్యాకెట్ల ఆఫర్ గందరగోళానికి దారితీసింది. ఆఫర్ కోసం సుమారు వెయ్యి మందికి పైగా జనం ఒక్కసారిగా ఎగబడటంతో భారీ తోపులాట జరిగింది. స్థానిక పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

## మోతినగర్లో హైడ్రా కూల్చివేతలు

హైదరాబాద్ మోతినగర్-బోరబండ రోడ్డు సిగ్నల్ ప్రాంతంలో రహదారి పక్కన ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా ం అధికారులు శుక్రవారం ఉదయం కూల్చివేశారు. రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఫుట్పాత్లు, రోడ్డు మార్జిన్లను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించారు. ఈ కూల్చివేతలకు ముందు స్థానికులకు, వ్యాపారులకు నోటీసులు ఇచ్చామని అధికారులు తెలిపారు.

# రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు వ్యతిరేకిస్తూ నిరసన




రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు శాఖ లో జీవో ఎంఎస్-396 ప్రకారం రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు(ఖీూఐ) ఏర్పాటును ఎన్టీఆర్ జిల్లా దస్తావేజులేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తుంది..!!అందులో భాగంగా ఈరోజు శుక్రవారం విజయవాడ గాంధీనగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరులు,అసిస్టెంట్లు, డిటిపి ఆపరేటర్లు,స్టాంప్ వెండర్లు నల్లరిబ్బన్లు ధరించి రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీ చింతకాయల నాగ సత్యనారాయణ మూర్తి గారు పాల్గొని ఎక్కడో మహారాష్ట్రలో అది కూడా ముంబై,పూనే నగరాల్లో మాత్రమే ఈ తరహా వ్యవస్థను ఏర్పాటు చేసి లీజు,తనఖా వంటి రిజిస్ట్రేషన్లు మాత్రమే చేస్తున్నారని కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాల రిజిస్ట్రేషన్లు చేయడానికి రంగం సిద్ధం చేస్తూ ,దస్తావేజు లేఖర్ల పొట్ట కొట్టడం భావ్యం కాదని తెలిపారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రముల ఏర్పాటు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, అలా ఉపసంహరించుకోకుంటే భవిష్యత్తులో తాము మరిన్ని నిరసన కార్యక్రమాలను చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి అధ్యక్షులు పైలా సతీష్ మాట్లాడుతూ తాము అభివృద్ధికి, టెక్నాలజీకి ఎప్పుడు వ్యతిరేకం కాదని కానీ రిజిస్ట్రేషన్డ స్టాంపుల శాఖకు అనుబంధంగా తాము 100 సంవత్సరాలకు పైబడి దస్తావేజు లేఖర్లగా సేవలందిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో ఎన్ని కొత్త తరహ విధానాలు తీసుకొచ్చిన వాటన్నింటినీ నేర్చుకొని అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ, చట్టపరంగా దస్తావేజులు రాస్తూ, ప్రభుత్వానికి,ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. అయితే ప్రస్తుతం పిపిపి విధానంలో ఈ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల్లో కొత్తవారికి ట్రైనింగ్ ఉపయోగించుకోవడం కన్నా, ఎంతో అనుభవం నైపుణ్యం గల దస్తావేజు లేఖర్లకు లైసెన్సులు/ఐడెంటిటీ ఇచ్చి తమ జీవన భృతిని కొనసాగించుకునే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.!!ఈ కార్యక్రమంలో విజయవాడ గాంధీనగర్ దస్తావేజు లేఖరులు ఎం చక్రధర్,ఏ వరహాల రావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావు,నరేంద్ర, కాజా రమేష్,సూర్యనారాయణ పలువురు యువ దస్తావేజు లేఖరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలి

### ఇంచార్జులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ూఎఖీ?ఃఒం



ఇంచార్జులతో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ూఎఖీ) కార్యక్రమం పురోగతి, ఃఒంలు చేపట్టాల్సిన బాధ్యతలు, ప్రజలకు అందించాల్సిన సహకారంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అత్యంత కీలకమైనదని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఃఒంలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ూఎఖీ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని, అవసరమైన దరఖాస్తులు నింపడంలో సహకరించాలని తెలిపారు.ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం, తప్పులు ఉండడం, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి అర్హత కలిగిన ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం అందించాలని అన్నారు.టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి పోలింగ్ బూత్‌లో ూఎఖీ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సందేహాలను నివృత్తి చేస్తూ, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తు సక్రమంగా పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు సేవాభావంతో పనిచేస్తే ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పోరేటర్లు నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల, గ్రామాల ూఎఖీ?ఃఒం ఇంచార్జులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## మహానంది పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఎ

### స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎస్పీ

### బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులకు ఆదేశం.... ?

నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ నేడు మహానంది పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ అక్కడ పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన బాధితులతో స్వయంగా



మాట్లాడారు. వారి సమస్యలను, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది, ఫిర్యాదులపై స్పందన ఎలా ఉందనే విషయాలపై స్పష్టత తీసుకున్నారు.స్టేషన్ పరిసరాలు గురించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ కేసులలో కట్టుబడిన వాహనాల గురించి ఆరా తీశారు."పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడికి తక్షణమే స్పందించి చట్టపరిధిలో న్యాయం చేయాలన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలి. బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదు.? బాధితులకు తగిన న్యాయం జరిగేలా చూడాలని అక్కడి అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ కుమారి ఎం. జావళి , తాలుకా రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# ఇల్లందకుంట నూతన తహసిల్దార్ కు సన్మానం.. దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు..



జమ్మికుంట, .ఇల్లంధకుంట మండలానికి నూతన తాసిల్దార్ గా వచ్చి బాధ్యతలు స్వీకరించిన మనోజ్ కుమార్ ను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు, మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి దేవస్థానం మెమెంటో, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన అందజేయాలన్నారు. ప్రజల సమస్యల పైన సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు గొడిశాల పరమేష్, గోలి కిరణ్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుండారపు సాయి, తదితరులు పాల్గొన్నారు..

## బేబీ గర్ల్ కిడ్నాప్ కేసును ఛేదించిన చందానగర్ పోలీసులు.. అంతరాష్ట్ర కిడ్నాప్ గ్యాంగ్ అరెస్ట్..

గత నెల 30వ తారీకున లింగంపల్లి రైల్వే స్టేషన్ బయట ఫుట్ బాత్ పైన నిద్రిస్తున్న భార్య భర్తల మధ్యలో నుండి బాలికను దుండగులు ఎత్తుకెళ్లిపోయారు. అదే రాత్రి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు మూడు బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ నేపధ్యంలో ఒక అంతర్రాష్ట్ర శిశు విక్రయ ముఠా గుట్టురట్టు చేసారు. ఒక నెల వయసున్న ఆడబిడ్డను రక్షించారు.

పోలీసుల తదుపరి విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పశ్చిమ బెంగాల్లోని కోల్కతా (తోప్సియా) ప్రాంతానికి చెందిన రెహ్నుమా అలీ (30) అనే మహిళకు 2021లో మహమ్మద్ సనవార్తో వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేకపోవడంతో, హైదరాబాద్లోని బంజారాహిల్స్లో నివసిస్తున్న తన పిన్ని నిమ్మీ జహానీ సీమా (భర్త హషీమ్ అలీ)ని సంప్రదించి, డబ్బులు ఇస్తానని, దత్తత కోసం ఏదైనా చిన్న బిడ్డను ఏర్పాటు చేయాలని కోరింది.

దీంతో సీమా నేరెడ్మెట్కు చెందిన తన స్నేహితురాలు నాజియాకు ఈ విషయం చెప్పింది. నాజియా వెంటనే వికారాబాద్కు చెందిన తన కాబోయే భర్త, నిందితుడైన జుబేర్కు సమాచారం అందిస్తూ.. ఒక పసిబిడ్డను తీసుకొస్తే భారీగా డబ్బులు ఇస్తారని ఆశ చూపింది.

### కిడ్నాప్కు పక్కా ప్రణాళిక

నిందితుడు జుబేర్ వెంటనే తన అనుచరుడు, వికారాబాద్ పోలీస్ స్టేషన్లో పాత దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్న ఆటో డ్రైవర్ ఇర్ఫాన్ను సంప్రదించాడు. వీరిద్దరూ కలిసి పసిబిడ్డను కిడ్నాప్ చేసి, అమ్మి సొమ్ము చేసుకోవాలని నేరపూరిత కుట్ర పన్నారు. అనువైన లక్ష్యం కోసం వెతుకుతుండగా, చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఒక తల్లి తన నెల రోజుల ఆడబిడ్డతో కలిసి ఫుట్పాత్పై నిద్రపోతుండటం వీరి కంటపడింది.

ముందుగా వేసుకున్న పథకం ప్రకారం, 30.06.2026 తెల్లవారుజామున నిందితులు తమ స్నేహితుడైన ఆరిఫ్కు చెందిన ఆటో-రిక్షాను అద్దెకు తీసుకుని ఘటనా స్థలానికి చేరుకున్నారు. తెల్లవారుజామున సుమారు 02:00 గంటల సమయంలో నిద్రిస్తున్న ఆ తల్లి ఒడిలో నుండి ఆ నెల రోజుల ఆడబిడ్డను బలవంతంగా కిడ్నాప్ చేశారు. అనంతరం ఆ బిడ్డను నాజియా ఇంటికి తీసుకెళ్లి, కిడ్నాప్ విజయవంతమైందని సీమా మరియు రెహ్నుమా అలీలకు సమాచారం అందించారు.

ఆన్లైన్ పేమెంట్ మరియు పోలీసుల ఎంట్రీ

01.07.2026 నాడు, రెహ్నుమా అలీ ఆ కిడ్నాప్ చేసిన బిడ్డను తన ఆధీనంలోకి తీసుకోవడం కోసం కోల్కతా నుండి తన పిన్ని సర్వారితో కలిసి ఫ్లైట్లో హైదరాబాద్కు చేరుకుంది. ఒప్పందంలో భాగంగా, నిందితుడు జుబేర్ ఆ పసిబిడ్డ అక్రమ విక్రయానికి సంబంధించి రెహ్నుమా అలీ నుండి ఆన్లైన్ పేమెంట్ ద్వారా రూ. 1,50,000/- అందుకున్నాడు.

అయితే, నిందితులు ఆ కిడ్నాప్ చేసిన బిడ్డతో కలకత్తాకు పారిపోయేలోపే అలర్ట్ అయిన పోలీసు బృందం నిందితులందరినీ విజయవంతంగా పట్టుకుంది. నెల రోజుల ఆడబిడ్డను సురక్షితంగా రక్షించి, తిరిగి ఆమె కన్నతల్లికి అప్పగించారు. పోలీసుల సత్వర విచారణ, సమన్వయ బృందకృషి మరియు విజయవంతమైన రెస్క్యూ ఆపరేషన్ కారణంగా ఈ అంతర్రాష్ట్ర మానవ రవాణా మరియు కిడ్నాప్ ముఠా ఆటకట్టయింది. విచారణ బృందాల సమన్వయ ప్రయత్నాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

## రావిపాడు లో ఘనంగా ధ్వజస్తంభ శంకుస్థాపన వేడుకలు



నరసరావుపేట, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం రావిపాడు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ధ్వజస్తంభం శంకుస్థాపన మహోత్సవ వేడుకలు వెంగళ్ రెడ్డి నగర్ లో నూతనముగా నిర్మాణంలో ఉన్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయ నిర్మాణంలో భాగంగా శుక్రవారం ధ్వజస్తంభ నిర్మాణమునకు, ప్రహరీ గోడ నిర్మాణమునకు, నీటి బోరు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు బిల్లా రాంబాబు, రమేష్ అన్నదమ్ములు, కొల్లి బ్రహ్మయ్య, బత్తుల మురళి, కృపాకర్ రావు, చేగు వెంకటేశ్వరరావు, ఏ వి ఆర్ కే సత్యనారాయణ, బొడ్డు వెంకట ఆంజనేయులు, కొత్తూరి ప్రసాదరావు, జగదీష్, రెడ్డి మురళీకృష్ణ, తాడువాయి శ్రీనివాసరావు, అరవపల్లి ప్రదీప్ కృష్ణ, జొన్నలగడ్డ నాగరాజేశ్వరి, కూకుట్ల పద్మావతి అనేక మంది భక్తులు మరియు దేవాలయ నిర్మాణానికి సహకరించిన దాతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వార్డెన్ హేమ ను సత్కరించిన మంత్రి

అల్లూరి మన్యం జిల్లాలో ఏడో తరగతి విద్యార్థిని ప్రాణాలను కాపాడిన వార్డెన్ హేమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సత్కరించారు. రవాణా సౌకర్యం లేని మారుమూల గిరిజన ప్రాంతంలో అస్వస్థతకు గురైన విద్యార్థి నిని హేమ తన నడు ముకు కట్టుకుని 6 కిలోమీటర్ల కాలిబాటలో మోసుకెళ్లారు. ఆమె చూపిన అసాధారణ మానవత్వాన్ని, నిబద్ధతను మంత్రి అభినందించారు.

# భద్రకాళి ఆలయం వద్ద ఉద్రిక్తత

వరంగల్ భద్రకాళి ఆలయం దగ్గర శుక్రవారం ఉద్రిక్త నెలకొంది. ప్రభుత్వ భూముల వేలంలో రూ.50 కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు గుప్పించారు. భద్రకాళి గుడిలో ప్రమాణం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు ప్రస్తుత కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి సవాల్ విసిరారు. దాంతో తడిబట్టలతో ప్రమాణం చేసేందుకు మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు ఆలయానికి చేరుకున్నారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం ముదరింది. పోలీసులు మర్రి యాదవరెడ్డిని, బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

# కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్ పై వేటు



సూర్యాపేట కోదాడ రూరల్ ఎస్ఈ గోపాల్ పై వేటు పడింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాన్వాయ్ను షెడ్యూల్ రూట్లో కాకుండా మరో మార్గంలో అయన తీసుకెళ్లారు. ఎస్ఐ గోపాల్ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. డీజీపీకి డిప్యూటీ సీఎం భట్టి స్వయంగా ఫిర్యాదు చేసారు. అలాగే, జోనల్-2 ఐజీ, సూర్యాపేట ఎస్పీలను భట్టి వివరణ కోరారు. ఈ నేపధ్యంలో ఎస్ఐ గోపాల్ను వీఆర్కు అటాచ్ చేస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# కూలి పని ఇప్పిస్తానని తీసుకెళ్లి బంగారం లాక్కుని మహిళను బావిలో తోసానే



కరీంనగర్ జిల్లాలో దారుణం జరిగింది. ఒక దుండగుడు కూలి పని ఇప్పిస్తానని తీసుకెళ్లి బంగారం లాక్కుని మహిళను బావిలో తోసేసాడు. బాధిత మహిళ 21 గంటలు బావిలోనే ఉండి, ప్రాణాలతో బయటపడింది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కిసాన్ నగర్ ప్రాంతంలో గంగాధర లక్ష్మీ(55) అనే మహిళ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఎప్పటిలాగే లక్ష్మిని కూలి అడ్డ వద్ద కొడుకు సందీప్ దిగబెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కూలి పని ఉందని ఆమెతో ఒప్పందం చేసుకున్నాడు. నుస్తులాపూర్ గ్రామ శివారుకు తీసుకెళ్లి, ఉదయం 11 గంటల సమయంలో మహిళ వద్ద ఉన్న అర తులం బంగారం, 4వేల నగదు లాక్కుని ఆమెను బావిలో తోసేసాడు. మహిళ బావిలో ఉన్న తాడు పట్టుకుని పైకి రావడం గమనించి, తాడును కోసేసి వెళ్ళిపోయాడు.

బాధితురాలు బావిలో ఈదుకుంటూ, మోటారుకున్న పైపును పట్టుకుని, ప్రాణాలు కాపాడుకుంది. రాత్రి అవుతున్నా తల్లి ఇంటికి రాకపోవడంతో బాధితురాలి కొడుకు సందీప్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. సెల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా నుస్తులాపూర్ గ్రామం అంతా గాలించినా మహిళ ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు బావి దగ్గరికి వెళ్ళిన భూ యజమానికి కేకలు వినపడడంతో తొంగి చూసి, లోపల మహిళ ఉందని సమాచారం ఇవ్వడంతో గ్రామస్థులు ఆమెను బయటికి తీసారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలు తెలిపిన వివరాల ఆధారంగా కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక ప్రగతి

**ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఎస్ హెచ్ జీ మహిళల ఉపాధికి మార్గం**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**తంగళ్ళపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

రాజన్న సిరిసిల్ల జూలై -03 ఇందిరా మహిళా శక్తి యూనిట్లు మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కింద తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) మహిళలు వెంకటసాయి కోల్డ్ ప్రెస్ ఆయిల్ ఌ ఫ్లోర్ మిల్ యూనిట్, కోవిదా మిల్క్ పాయింట్ ఏర్పాటు చేసుకోగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రారంభించారు. వాటి పని తీరు, ఉపాధి, ఆదాయం తదితర వివరాలను మహిళలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి కింద రెండు యూనిట్లు ప్రారంభించామని తెలిపారు. ఒక యూనిట్లో కోల్డ్ ప్రెస్సింగ్ ఆయిల్, పిండి గిర్ని, ఇతర దాదాపు ఆరు యంత్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు.



దాదాపు రూ. 11 లక్షల 50 వేలతో యూనిట్ ప్రారంభించారని వివరించారు దీనికి పీ ఎం ఎఫ్ ఎం ఈ కింద రూ . 3 లక్షల 50 వేల సబ్సిడీ అందుతుందని వెల్లడించారు. అలాగే మరో మహిళ డైరీ యూనిట్ ను ఏర్పాటు చేసుకున్నారని, దీనికి మహిళా సంఘాల నుంచి దాదాపు రూ.5 లక్షల రుణం ఇప్పించామని తెలిపారు. ఇక్కడ ఇతర డైరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇలాంటి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేసేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. యూనిట్లు ఏర్పాటు చేయడంతో ఉపాధితోపాటు మహిళా సాధికారతకు దోహదం చేస్తుందని వివరించారు. నిన్న బ్యాంకర్ల సమావేశంలో ఇదే విషయంపై చర్చించి.. మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.జిల్లాలోని గ్రామీణ మహిళా, పురుష అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్ సేఠీ (ఖీ ాఇఐ) ఆద్వర్యంలో అందుబాటులో ఉందని వెల్లడించారు. శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా రాణించేందుకు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఏఎంసీ వైస్ చైర్మెన్ నర్సింగం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఇంచార్జి ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ మీర్జా, సర్పంచ్ లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కు సన్మానం..



జమ్మికుంట, .వీణవంక మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వీణవంక ఎంపీడీఓ ఆఫీస్ కు వచ్చిన చైర్మన్ స్వప్న -సదానందం ను వీణవంక మండల మాజీ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, డైరెక్టర్ నల్లగొని సతీష్ లు శాలువా తో సన్మానం చేయడం జరిగింది.మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వీణవంక మండలం లోనీ ప్రభుత్వ కార్యక్రమానికి రావడం పట్ల వీణవంక మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తానని వారు ఈ సందర్భంగా అన్నారు. మండలంలో పార్టీలకతీతంగా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమం ఉన్న తప్పకుండా తనకు సమాచారం ఇవ్వాలని వారు అన్నారు..

# మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని, జీవన విధానాన్ని నిర్ణయిస్తుంది..

## డా అడ్డాల, డా శ్రీమన్నారాయణ



స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలోఅకడమిక్ డైరెక్టర్ డా బి ఇ వి ఎల్ ఎన్ నాయుడు అద్యక్షతన విద్యార్థులకు " ఏమి తినాలి, ఎలా తినాలి " అనే ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ యశోద ఆసుపత్రి నుంచి వచ్చిన గేస్ట్రోఎంట్రాలజిస్ట్ డా వై శ్రీమన్నారాయణ మాట్లాడుతూ "మన జీవన విధానంలో "ఏమి తినాలి" అనే విషయంతో పాటు "ఎలా తినాలి" అనేది కూడా చాలా ముఖ్యమని ,?మన శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందాలంటే దంపుడు బియ్యం, జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు వంటి పీచుపదార్థాలు ఎక్కువ ఉన్నవి ఎంచుకోవాలి, సీజన్ను బట్టి దొరికే తాజా కూరగాయలు, ఆకుకూరలు రోజూ భోజనంలో భాగం కావాలని, శరీర పుష్టికి కందిపప్పు, పెసరపప్పు, శనగలు, మినుములు లేదా మొలకెత్తిన గింజలు తీసుకోవాలని,?రోజుకు కనీసం ఒక తాజా పండైనా (జామ, ఆపిల్, బొప్పాయి, అరటి వంటివి) తినడం మంచిదని, పాలు, పెరుగు లేదా మజ్జిగ, నెయ్యి మరియు డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలని, ?మైదా, వైట్ షుగర్ వంటివి శరీరానికి ఎలాంటి పోషకాలను ఇవ్వవు, పైగా బరువును, షుగర్ను పెంచుతాయని, ? చిప్స్, ప్యాకెట్ ఫుడ్స్, సాఫ్ట్ డ్రింక్స్.నూనెలో బాగా వేయించిన కూరలు, జంక్ ఫుడ్ను మానేయాలని, వంటల్లో ఉప్పు, కారం, నూనెలను పరిమితంగా వాడటం మరియు రోజుకు కనీసం 3 నుండి 4 లీటర్ల నీరు తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని , ఎల్లప్పుడూ ఇంట్లో వండిన తాజా ఆహారానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. దంత వైద్యులు డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ "?భోజనం చేసేటప్పుడు టీవీలు, మొబైల్స్ చూడటం లేదా కోపంగా, ఆందోళనగా ఉండటం మంచిది కాదని , ఆహారంపైనే దృష్టి పెట్టి తినాలని, నోట్లోనే ఆహారం లాలాజలంతో బాగా కలవాలని ,ఇది జీర్ణక్రియను 50% సులభతరం చేస్తుందని, సుఖాసనంలో కూర్చుని తినడం చాలా మంచిదని, . దీనివల్ల జీర్ణాశయానికి రక్తప్రసరణ బాగా జరుగుతుందని, కడుపులోసగం వంతు ఆహారానికి, పావు వంతు నీటికి, మిగతా పావు వంతు గాలి ఆడేలా ఖాళీగా ఉంచాలని, ప్రతిరోజూ ఒకే సమయానికి తినడం అలవాటు చేసుకోవాలని , రాత్రి భోజనం పడుకోవడానికి కనీసం 2 గంటల ముందే ముగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ తేజేశ్వరరావు, శివ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జోన్-7 జోగులాంబ డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్



మహబూబ్ నగర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం మహబూబ్నగర్ జిల్లా మిడ్జిల్ గ్రామ పర్యటన నేపథ్యంలో భద్రతా మరియు ఇతర ఏర్పాట్లను జోన్-7 జోగులాంబ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్,శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, తో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంగణం, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ మరియు ఇతర బందోబస్తు ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు.

అనంతరం డీఐజీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వీబీజీ రామ్ జీ తో కేంద్రానికి పేరుస్తుందని కాంగ్రెస్ కు అక్కసు

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



కరీంనగర్ లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి. వీబీజీ రామ్ జీ పథకం ద్వారా పేదలకు ఎంతగానో మేలు జరగడంతోపాటు గ్రామాల్లో ఆస్తుల సృష్టి జరగబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తే కేంద్రానికి మంచి పేరుస్తుందని అక్కసుతోనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఈ స్కీం అమలు రాష్ట్రానికి భారం అన్పిస్తే ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లాలే తప్ప కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలనుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులు, టీచర్లకు బ్రేక్ ఫాస్ట్, పాలు, లంచ్ సౌకర్యం కల్పించడాన్ని కేంద్ర మంత్రి స్వాగతించారు. ఒకవైపు బ్రేక్ పాస్ట్ సౌకర్యం కల్పిస్తూనే మరోవైపు రాష్ట్రంలో ఏకంగా 10 వేల స్కూళ్లను మూసివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠశాలలను మూసివేయడం దుర్మార్గమన్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో బాధ్యులపై ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం వెనుక కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మ్యాచ్ పిక్సింగ్ జరగడమే కారణమన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుతోందని, చాపకింద నీరుగా బలపడుతుండటంతో ఓర్వలేకి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కుమ్మక్కై బిగ్ బాస్ షోను తలపించేలా డ్రామాలాడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలు అవినీతి పార్టీలేనని, అందుకే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అందుకే తెలంగాణ ప్రజలు ఆ రెండు పార్టీలను ఎలిమినేషన్ చేసి డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఈరోజు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ కేపీపీ చంద్ర టింకు తో కలిసి కరీంనగర్ లోని 37వ డివిజన్ లో రూ.77 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. షాషామహల్ ప్రాంతంలో ఓపెన్ జిమ్ ను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే:కరీంనగర్ లోనా 37వ డివిజన్ లో రూ.77 లక్షల మన్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. 7వ డివిజన్ లో బీజేపీ గెలవదని చాలా మంది చెప్పారు. కానీ గెలిచి చూపించాం చంద్రను ఆశ్వీరించారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం సమస్యల్లేని డివిజన్ గా తీర్చిదిద్దుతా. మరో వారం రోజుల్లో రూ.50 కోట్ల యూడీఎఫ్ నిధులతో కరీంనగర్ లో రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించబోతున్నాం.

# మహిళా సాధికారతే మోదీ ప్రభుత్వ లక్ష్యం: బండి సంజయ్



కరీంనగర్ ఎల్ఎండీ కాలనీలోని మహిళా శిశు వికాస్ కేంద్రంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మహిళలకు సీఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఉజ్వల యోజన, ముద్రా యోజన, సుకన్య సమృద్ధి యోజన, మిషన్ శక్తి వంటి పథకాల ద్వారా మహిళలకు విస్తృతంగా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. మహిళల పేరిటే ఇళ్లు, గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. నారీ శక్తి వందన్ చట్టం ద్వారా త్వరలోనే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మహిళా ఆర్థికాభివృద్ధి సంఘం చైర్మన్ శోభారాణి, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మహిళలు కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని బండి సంజయ్ ఆకాంక్షించారు.

## ఎస్ఆర్ఆర్ అటనామస్ కళాశాల పీజీ సెమిస్టర్ ఫలితాల విడుదల



కరీంనగర్ స్థానిక శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ అటనామస్ కళాశాల పీజీ మొదటి మూడవ సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ అధ్యాపకుల బృందంతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ పీజీ మొదటి సెమిస్టర్ లో 233 మంది పరీక్షలు రాయగా 213 మంది ఉత్తీర్ణత సాధించి 91 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, పీజీ మూడవ సెమిస్టర్ లో 246 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 215 మంది ఉత్తీర్ణత సాధించి 87 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసినట్లు తెలియజేశారు. విద్యార్థులు వలీజీఎఎతీజీనిఇష్ట.ఇనీఎ వెబ్సైట్లో తమ ఫలితాలను చూసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్ టి రాజయ్య, టీజీసిటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎం మల్లారెడ్డి అకాడమిక్ సమన్వయకర్తలు డాక్టర్ ఏ శంకరయ్య కట్టా వేణు ఐక్యూఏసి సమన్వయకర్త డాక్టర్ హర్జ్యోత్ కౌర్ అటనామస్ సమన్వయకర్త ఢ స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## చేనేతలను ఆదుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే: గంగుల కమలాకర్



కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో జరిగిన చేనేత పారిశ్రామిక, సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన పాలకవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, చేనేత రంగాన్ని బలోపేతం చేయడం, నేత కార్మికుల కుటుంబాలకు అండగా నిలవడం విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. సిరిసిల్ల చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు పండుగల సందర్భంగా పంపిణీ చేసే చీరల తయారీ బాధ్యతలను అప్పటి ప్రభుత్వం వారికి అప్పగించిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వస్త్రాల టెండర్లను ఇతర రాష్ట్రాలకు అప్పగించడం వల్ల స్థానిక చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆయన విమర్శించారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వాసాల రమేష్, సంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## మూడు విండోలకు కొత్త పాలకవర్గాలు నియామకపు ఉత్తర్వులు జారీ

కరీంనగర్ కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని మానకొండూర్, తాడికల్, మెట్ పల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు నూతనంగా చైర్మన్లు నియామకయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ ఉత్వర్వులు జారీ చేశారు.

మానకొండూర్ "విండో" చైర్మన్ నాగిశెట్టి రాజయ్యమానకొండూర్ సింగిల్ విండో చైర్మన్ గా కొండపలకల గ్రామానికి చెందిన నాగిశెట్టి రాజయ్య, డైరెక్టర్లుగా ఏనుగుల చొక్కారెడ్డి(సదాశివపల్లి), కత్తెర్ల రాజు (అన్నారం), మంగురపు నర్సవ్వ(అన్నారం), గోని తిరుపతిగౌడ్ (చెంజర్ల), గాలి మొగిలి(చెంజర్ల), కొట్టె అంజిరెడ్డి (ఈదుల గట్టెపల్లి), ఎం.రామకృష్ణ (గంగిపల్లి), దూలం దేవేంద్ర (కొండపలకల), కొలిపాక మొగిలి(కొండపలకల), బుర్ర శ్రీకాంత్ (మద్దికుంట), కుర్ర వెంకటస్వామి (మానకొండూర్), ఏగోళపు శ్రీనివాస్ గౌడ్(ముంజంపల్లి) నియామకయ్యారు.

తాడికల్ "విండో" చైర్మన్ గా కీసర సంపత్శంకరపట్నం మండలం తాడికల్ సింగిల్ విండో చైర్మన్ తాడికల్ గ్రామానికి చెందిన కీసర సంపత్, డైరెక్టర్లుగా కల్లెపల్లి రాజయ్య(కేశవపట్నం), తుమ్మేటి కొండల్ రెడ్డి (అంబాలపూర్), గీట్ల గోపాల్ రెడ్డి( ఇప్పలపల్లి), సంబు తిరుపతి(కరీంపేట్), గాజుల లస్మవ్వ(కేశవపట్నం), సుద్దాల రాజేందర్ (ముత్తారం), జనగాం రాజయ్య(తాడికల్), తిరుపతి సమ్మయ్య(తాడికల్), పింగళి జయలక్ష్మి(తాడికల్), తాళ్లపల్లి కొమురయ్య(వన్నారం), ఓదెల రాజయ్య (ఎరడపల్లి), కలకుంట్ల సత్యనారాయణ రావు (ఎరపడపల్లి) నియామకయ్యారు.

మెట్ పల్లి "విండో" చైర్మన్ గా గాజుల మహేష్మెట్ పల్లి సింగిల్ విండో చైర్మన్ గా మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల మహేశ్, డైరెక్టర్లుగా పొన్నోజు సదానందం(మెట్ పల్లి), నాంపెల్లి శ్రీనివాస్ (ఆముదాలపల్లి), పెద్ది ముత్తారెడ్డి (ఆముదాలపల్లి), వంగల కృష్ణారెడ్డి (కన్నాపూర్), కాల్వ మహేందర్ రెడ్డి (కన్నాపూర్), ఉప్పుగల్ల రాజిరెడ్డి (కొత్తగట్టు), అంబాల కోటి (కొత్తగట్టు), గాజుల నిర్మల( లింగాపూర్), బొల్లిపల్లి శ్రీనివాస్ (లింగాపూర్), అంగిడి సారయ్య( మెట్పల్లి), బొమ్మెన గట్టయ్య (మెట్పల్లి), దుబ్బాల సమ్మక్క ( మొలంగూర్) నియామకయ్యారు.

విండోల పరపతి పెంచేలా కృషి చేయండి :

ఎమ్మెల్యే కవ్వంపల్లి

ప్రాథమిక సహకార పరపతి సంఘాల పరపతి పెంచడంతోపాటు రైతులకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా కొత్త పాలకవర్గాలు సమిష్టిగా కృషి చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. నూతనంగా సింగిల్ విండో చైర్మన్లు నియామకమైన నాగిశెట్టి రాజయ్య, కీసర సంపత్, గాజుల మహేష్ తోపాటు డైరెక్టర్లకు అభినందనలు తెలియజేశారు. పాలకవర్గాల పదవీకాలం విజయవంతంగా సాగి, రైతు సంక్షేమం,సహకార రంగ అభివృద్ధికి విశేష సేవలందించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కట్టు దిట్టంగా అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

## నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు



, గోదావరిఖని: పెద్దపెల్లిజిల్లాలోని గోదావరిఖనిలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత, వడ్డింపు వంటి అన్ని అంశాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బందికి ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, వినియోగదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసి, అవసరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం మాత్రమే తిరిగి నిర్వహణకు అనుమతులు ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.మే 29న మంథని మార్కెట్ ప్రాంతంలోని శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్, జూన్ 13న గోదావరిఖనిలోని డెస్టినేషన్ రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి ఆయా రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు.తదనంతరం ఆయా సంస్థల నిర్వాహకులు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేపట్టడంతో, ఫుడ్ సేఫ్టీ అధికారుల పునఃపరిశీలన అనంతరం శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్కు జూన్ 4న, డెస్టినేషన్ రెస్టారెంట్కు జూన్ 30న తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు.జిల్లాలోని ఇతర హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎక్కడైనా అపరిశుభ్రత లేదా నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వెంటనే సంబంధిత సంస్థలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన లో పేర్కొన్నారు.

# గ్రామాలవారీగా సి ఏం రిలీఫ్ ఫండ్ పంపిణీ



కొడిమ్యాల, కొడిమ్యాల మండలం లోని సూరం పేట, కొడిమ్యాల నాచుపల్లి గ్రామాల వారిగా కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి చేతుల మీదుగా సి ఏం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రసహకార బ్యాంక్ డైరెక్టర్ గుడి మల్లి కార్జునరెడ్డి, మాజీ జెడ్పి టీసి చిలువేరి నారాయణగౌడ్, ముమ్మాడీ స్వామి పాల్గొన్నారు.

# బదిపల్లిలో సార్ ప్రత్యేక సమగ్ర కార్యక్రమం



కొత్తపల్లి బదిపల్లి గ్రామంలో నిర్వహించిన సార్ ప్రత్యేక సమగ్ర కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓతో కలిసి కాంగ్రెస్ నాయకులు కోదూరు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని గణేష్, మండల ప్రధాన కార్యదర్శి మునిగల శ్రీనివాస్, గ్రామ ఉపాధ్యక్షుడు తాండ్ర సంజీవ్, గ్రామ ప్రధాన కార్యదర్శి తాండ్ర రాజకుమార్, ఐదో వార్డు సభ్యుడు గర్రెపల్లి వెంకటేష్, కారోబారి వెంగళం వాసరయ్య పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు గ్రామ ప్రజలు సహకరించారు.

## ప్రతి ఓటర్ నుండి కచ్చితంగా సమాచారాన్ని సేకరించాలి! ఆర్డీవో కిడారి సందీప్ కుమార్




సి.బెళగల్ మండల పరిధిలోని ఎనగండ్ల గ్రామంలో కర్నూల్ ఆర్డీవో కిడారి సందీప్ కుమార్ పర్యటించారు. ఈ పర్యటనలో గ్రామంలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించి బిఎల్వోలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఓటర్ నుండి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో గల ప్రభుత్వ చౌకధర దుకాణాలను తనిఖీ చేసి,పలు రికార్డులను, కొలతలను, దుకాణాల్లో ఉన్న నిలువలను పరిశీలించారు. ప్రజలకు రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసిల్దార్ వెంకటలక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ శ్యామలమ్మ, వీఆర్వో శ్రీనివాసులు, బిఎల్వోలు వెంకటేశ్వరమ్మ, ఆరోని తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అందరికీ ఓటు హక్కు కల్పించాలి.



**రాజేంద్రనగర్ ప్రజా బలం ప్రతినిధి 3 జులై 2026**ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించడమే కర్తవ్యంగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం చేపట్టిన సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 సముచిత చర్య కాగా అందుకు సంబంధించి తేలికగా ఎన్యూమరేషన్ ఫారమ్ పూరించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఓటర్లు తమ ఇంటి నుంచే మొబైల్ లేదా కంప్యూటర్ ద్వారా ప్రక్రియను కొత్త గైడ్‌లైన్స్ ద్వారా పూర్తి చేసే విధానాన్ని స్థానికులకు అందుబాటులోకి తెచ్చినను, అవగాహన సరిగా లేని కారణంగా స్థానిక ప్రజలు ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ ఫారమ్ నింపలేఖ నానా అవస్థలు పడుతున్నారు. ఇక ప్రస్తుతం ఓటరుగా నమోదు పొందిన వారికి మాత్రమే ఆఫ్ లైన్ ఫారమ్ లు విడుదల చేసినను, బూత్ లెవల్ అధికారులకు ఇచ్చిన బూత్ లిస్ట్, యాఫ్ సహకారంతో వోటర్ ఫోటో, ఫోన్ నెంబర్లు ఉన్నను, సంబంధిత ఓటర్ల అడ్రస్ లను కనుక్కొవడంలో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇందు వలన వాళ్ళకి ఇచ్చిన సమయం కాస్తా ముగిసి పోతుందని, మరి అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించడానికి కొత్త ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఎప్పుడు ఇస్తారు వాళ్లు తిరిగి వారి పేర్లు ఎప్పుడు నమోదు చేసుకోవాలో తెలియక ప్రజలు తీవ్ర కలత చెందుతున్నారు. అందుకు పరిష్కార దిశగా అధికారులు స్పందించి బూత్ వారిగా కాకుండా బస్తీ వారిగా, కాలనీల వారిగా పాత, కొత్త తర తమ బేదం లేకుండా ప్రజాస్వామ్మనికి భంగం కలుగకుండా స్థానికముగా నివాస ముంట్టున్న వారందరి పేర్లు నమోదు చేయాలని బూత్ లెవల్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తే బాగుంటుందని ది సిటీజేన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందే లక్ష్మణ్ రావు తన అభిప్రాయాన్ని ప్రజల మేలు కోరి, వారి ఉద్దేశంను బలపరుస్తు సందేశం ఇచ్చారు.

# బీఆర్ఎస్ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే మెచ్చా భేటీ



**సత్తుపల్లి ప్రతినిధి జూలై03 ప్రజాబలం:**దమ్మపేట మండలం లచ్చాపురం గ్రామంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు యట్ల వెంకమ్మ ఆహ్వానం మేరకు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆమె నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయంగా సమావేశమై స్థానిక రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, "వచ్చేది ఏ ఎన్నికైనా ఎగిరేది గులాబీ జెండానే" అని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో నిజమైన ఓట్లు తొలగించబడకుండా ప్రతి పార్టీ నాయకుడు అప్రమత్తంగా ఉండాలని, బిఎల్ఏ లను ఎప్పటికప్పుడు చైతన్యపరుస్తూ ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని సూచించారు.

పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, భవిష్యత్తులో పార్టీ తరఫున మంచి అవకాశాలు కూడా కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న మువ్వా విజయబాబు.



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై03 ప్రజాబలం:**విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో టీజీ ఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని,



రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ప్రార్థించారు.

## సత్తుపల్లి నియోజకవర్గం బిఎల్ఎ ఇన్చార్జిగా రాయల రాము.



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై03 ప్రజాబలం:** సత్తుపల్లి నియోజకవర్గ బి ఎల్ ఎ ఇన్చార్జిగా తల్లాడ పట్టణానికి చెందిన రాయల రామును నియమించారు. ఇటీవలే కొనసాగుతున్న స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా ఖమ్మం జిల్లాలో పలు నియోజకవర్గాలకు ఇన్చార్జీలను నియమించారు దీనిలో భాగంగా సత్తుపల్లి నియోజకవర్గం ఇన్చార్జిగా రాయల రామును నియమించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇన్చార్జిగా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కు, సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తమపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

# ఎస్ఐఆర్ ఫారాలు సమర్పించిన మాజీ మంత్రి పువ్వాడ.



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 3 ప్రజాబలం:**మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుక్రవారం తన కుటుంబ సభ్యుల ఎస్ ఐ ఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బి ఎల్ ఓ శ్రీమతి షాహీన్ కమల్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

అనంతరం పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబం ఎస్ ఐ ఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా నింపి సంబంధిత బి ఎల్ ఓ లకు అందజేయాలని కోరారు. ఫారాల నింపడం లేదా వివరాల నమోదులో ఎలాంటి సందేహాలు, ఇబ్బందులు ఎదురైనా బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రతి డివిజన్‌లో అందుబాటులో ఉన్న బి ఎల్ ఎస్ సభ్యులు ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి.

## విద్యార్థి సంఘాల డిమాండ్

## మధిరలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై03 ప్రజాబలం:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధిర నియోజకవర్గ కేంద్రంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు జమ్మి అశోక్, మంద సురేష్, దాసరి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరిని వీడి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలలు మరియు హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యుత్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన "యంగ్ ఇండియా కిట్" ను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. యంగ్




ఇండియా కిట్‌లో విద్యార్థులకు అవసరమైన టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్, జ్యామెట్రీ బాక్స్, పెన్, పెన్సిల్, ట్రై–బెల్ట్, ఐడీ కార్డు, షూస్, సాక్స్, పిటి డ్రస్, ట్రాక్ సూట్, జాకెట్, రెయిన్ కోట్, వ్యక్తిగత పరిశుభ్రత సామగ్రి తదితర అవసరమైన వస్తువులను పూర్తిస్థాయిలో అందించాలని కోరారు.

ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, లేకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

ప్రధాన డిమాండ్లు

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి.

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి.

పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి.

హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, పరిశుభ్రతను నిర్ధారించాలి.

యంగ్ ఇండియా కిట్లను విద్యార్థులందరికీ వెంటనే పంపిణీ చేయాలి.

టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్, జ్యామెట్రీ బాక్స్, ట్రాక్ సూట్, షూస్, జాకెట్ తదితర సామగ్రిని పూర్తిస్థాయిలో అందించాలి.

ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి రాము సిహెచ్ అజయ్, నాయకులు నవీన్, గోపి, సాయి తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# పలు వేడుకల్లో పాల్గొన్న వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్





**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై03 ప్రజాబలం:**తల్లాడ మండలం పాత పినపాక గ్రామస్తులు ఎక్కిరాల చిన్నికృష్ణ వెంకట నరసమ్మ దంపతుల కుమారుడు రాంప్రసాద్ విత్ పూజిత రిసెప్షన్ కార్యక్రమానికి కాపా సుధాకర్ హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి దీవించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తల్లాడ పట్టణ వాస్తవ్యులు దగ్గుల కాంతారెడ్డి నాగరత్నం నూతన గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లవరం సర్పంచ్ కటికి కిరణ్ కుమార్, కాపా మహేష్, మంగాపురం ఉపసర్పంచ్ గుజ్జర్లపూడి చింటూ, కేశవాపురం మాజీ ఉపసర్పంచ్ రావూరి ఇజ్రాయిల్, షేక్ జమాల్, అక్కల హరీష్ రెడ్డి, సరికొండ నరేష్ రాజ్, బొడ్డు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# హోతి(బి)లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పరిశీలన



**జహీరాబాద్, జూలై 3 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలంలోని హోతి(బి) గ్రామంలో 266, 267, 268 బూత్‌లలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంజీ రాములు శుక్రవారం పరిశీలించారు. బీఎల్ఏలు, బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికీ నిర్వహిస్తున్న ఓటరు వివరాల ధృవీకరణ ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు కోల్పోకుండా ఉండాలంటే ప్రజలు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసి సంబంధిత ఫారాలను సరైన విధంగా సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడంలో బీఎల్‌వోల సేవలు కీలకమని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రేమ్‌కుమార్ సర్పంచ్, వెంకట్‌రెడ్డి మాజీ సర్పంచ్, జాకీర్ పటేల్, మాజీ ఎంపీటీసీ వాజీద్ పటేల్, అలెగ్జాండర్, అవినాష్, సురేష్, రాజు, వెంకట్, స్వప్న, లక్ష్మారెడ్డి, కిష్టన్న, నవీన్, అయిజాజ్, వసంత్, మహేష్, ప్రభు, రాకేష్ రోషన్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు, బీఎల్‌వోలు అంజమ్మ, ఇదిరమ్మ, శోభారాణి, భుజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి - పీడీఎస్‌యూ



**జహీరాబాద్, జులై 3 ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ అనుమతులు, గుర్తింపు లేకుండా భృంగి ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహిస్తున్నట్లు ఆరోపిస్తూ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం అధికారికి వినతిపత్రం అందజేసింది.

ఈ సందర్భంగా పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండానే పాఠశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు మండల ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గుర్తింపు లేని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన మండల ఎంఈఓపై కూడా చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి ఈ. గోపాల్‌తో పాటు రాజ్, రాకేష్, మహ్మద్ రఫీ, శంషాద్, భాగ్యశ్రీ, అంబిక, వైష్ణవి, అక్షయ, భవాని, సాక్షి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# త్యాగరాయ గాన సభ వేదికగా జులై 6న మంగళంపల్లి బాలమురళీకృష్ణ 96వ జయంతి వేడుకలు




పద్మ విభూషణ్ గానగంధరుడు డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ 96వ జయంతి వేడుకలు చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ వేదికగా ఘనంగా నిర్వహించనున్నామని మంగళంపల్లి సత్యనారాయణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంగళంపల్లి సత్యనారాయణ తెలియజేశారు. ఈ మేరకు సోమాజిగూడ,ప్రెస్ క్లబ్లో జులై 6న నిర్వహించే జయంతి వేడుకల పోస్టర్ ను ఆవిష్కరించారు. జులై 6న నిర్వహించే ఈ వేడుకలలో మంగళంపల్లి సత్యనారాయణ ఫౌండేషన్ ద్వారా జాతీయ పురస్కారాలు గెలుచుకున్న 23 మంది కళాకారులను గౌరవంగా సత్కరించుకోబోతున్నామని తెలిపారు. మంగళంపల్లి సత్యనారాయణ ఫౌండేషన్ నెలకొల్పిన తర్వాత మొట్టమొదటిగా నిర్వహించ కోబోయే ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం ద్వారా పూర్తి సహాయ సహకారాలు లభిస్తున్నాయని అందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. తమ ఫౌండేషన్ భారతీయ సంస్కృతి, కలలు వారసత్వ పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తుంది అని తెలిపారు.

# మల్యాల గ్రామంలో వైద్య శిభిరం.



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 03**ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలోని మారుమూల ప్రాంతాలైన జంపన్న వాగు పరివాహ ప్రాంతం కొండాయి గ్రామంలో గిరిజన బిడ్డలకు వర్షాకాలం సీజన్ కావడంతో ముందస్తుగా గిరిజనుల ప్రాణాలు కాపాడాలని దృఢ సంకల్పంతో వాగులను సైతం లెక్కచేయకుండా వాగులు వంకలు దాటుతూ గిరిజనులకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన వైద్య అధికారి డాక్టర్ హెచ్ ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో మల్యాల గ్రామంలో వైద్య శిభిరం ఏర్పాటు చేయడం జరిగింది.

45 మందికి మందులు ఇవ్వడం జరిగింది ఇశీదులో భాగంగా ఇద్దరికి మలేరియా పరీక్షలు చేయగా ఈ పరీక్షలో నెగెటివ్ రిపోర్ట్ వచ్చింది వారికి తగిన మందులు పంపిణీ చేయడం జరిగింది,ఆహారం మరియు పరిసరాల పరిశుభ్రత పాటించమని మరియు దోమ తెరలు వాడమని చెప్పడం జరిగింది , ప్రజలకు వేడి చేసిన నీరు కాచి త్రాగమని చూచనలు ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమశీలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ రావు,ఆశలు జ్యోతి పాల్గొన్నారు.

# పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం -ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, జూలై 3 ప్రజాబలం ప్రతినిధి:**




జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ చెక్కులను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు వరంగా నిలుస్తోందన్నారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే నిరుపేదలకు ఈ నిధి ఎంతో అండగా ఉంటోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ గౌస్ గౌరి, బరూర్ దత్తాత్రి, హోతి(బి) గ్రామ సర్పంచ్ మచ్చేందర్, యువ నాయకుడు కొనింటి మిథున్‌రాజ్, నాయకులు షకీల్, గోపాల్, చిన్నరెడ్డి, సయీద్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్‌పై అపోహాలు అవసరం లేదు: కౌన్సిలర్ శ్రావణ్ కుమార్



**జహీరాబాద్ జులై 3 ప్రజాబలం ప్రతినిధి:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని జహీరాబాద్ మున్సిపాలిటీ 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం వార్డులో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో సహకరించడంతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్‌లో మరణించిన వారు, అనర్హులైన వారి పేర్లు మాత్రమే తొలగిస్తారని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా తనను లేదా సంబంధిత బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు. శాంతినగర్ నుంచి ఇతర ప్రాంతాలకు నివాసం మార్చుకున్న స్థానిక ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారుల సహకారంతో వారి సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

# జూలై 4న శ్రీ దొడ్డి కొమురయ్య వర్ధంతి . జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై03 ప్రజాబలం:**జూలై 4న ఉదయం 9 గంటలకు ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద శ్రీ దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఇట్టి కార్యక్రమంలో శ్రీ దొడ్డి కొమురయ్య విగ్రహానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ కులస్తులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వరద నీటితో ఇబ్బంది లేకుండా చర్యలు: కమిషనర్ ప్రభాకర్



**జహీరాబాద్, జూలై 3 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణంలోని భరత్‌నగర్ రోడ్డు పరిసరాల్లో కొనసాగుతున్న వర్షపు నీటి కాలువల పూడిక తొలగింపు పనులను మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కాలువల్లో పేరుకుపోయిన పూడికను పూర్తిస్థాయిలో తొలగించి, వర్షపు నీరు ఎటువంటి అవరోధాలు లేకుండా సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో నీటిమునిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు. పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు మున్సిపల్ యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు.

# 15 వేల మందితో భారీ వనమహోత్సవ ర్యాలీ

## రాష్ట్ర చరిత్రలో అరుదైన ఘట్టం.



**సత్తుపల్లి ప్రతినిధి జూలై 3 ప్రజాబలం:** రాష్ట్ర చరిత్రలోనే అరుదైన ఘట్టంగా సత్తుపల్లి పట్టణంలో సుమారు 15 వేల మందితో భారీ వనమహోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విశేష చైతన్యాన్ని కల్పించింది.

జేవీఆర్ కాలేజ్ గ్రౌండ్‌లో ప్రారంభమైన వనమహోత్సవ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జేవీఆర్ కాలేజ్ నుంచి పాత సెంటర్ వరకు వేలాది మంది విద్యార్థులు, యువత, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్న భారీ ర్యాలీ కొనసాగింది. జేవీఆర్ గ్రౌండ్ ప్రజలతో కిక్కిరిసిపోయి కన్నుల పండుగగా మారింది.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని విద్యార్థులు, చిన్నారులతో కలిసి ర్యాలీలో నడుస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతును చాటారు. ర్యాలీలో జానపద కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ, ఇంత భారీ స్థాయిలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, తాను ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలతో జరిగిన పర్యావరణ కార్యక్రమంలో పాల్గొనడం ఇదే తొలిసారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ, సత్తుపల్లి నియోజకవర్గం విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యంలో ముందంజలో ఉందని, 15 వేల మందితో నిర్వహించిన ఈ భారీ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపును పొందుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, డీఎఫ్‌వో, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి.

## టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి,నాగేశ్వరరావు డిమాండ్.



ఏన్కూర్ జులై 3: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పిఆర్సీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, 2023 జులై నుండి అమలు కావాల్సిన నూతన పీఆర్సీ 36 నెలల కాలం పూర్తి అయినందున ప్రభుత్వం వెంటనే నివేదికను తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. హెల్త్ కార్డుల విధివిధానాలు రూపొందించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ సభ్యత్వ క్యాంపైన్ మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమావేశాలలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉపాధ్యాయుల డిఎ బకాయిలు విడుదల చేయాలని, బకాయి ఉన్న ఐదు వాయిదాల డిఎ లను ప్రకటించాలని,హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని, ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలను రూపొందించి పర్యవేక్షణ అధికారుల పదోన్నతులు చేపట్టాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, 2003 డిఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని, కెజిబివి, సమగ్ర శిక్షా ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని,సమ్మె కాలపు వేతనం మంజూరు చేయాలని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని సవరించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని, బోధించే సబ్జెక్టులలో టెట్ పరీక్షలు నిర్వహించాలని, సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. పాఠశాలలకు యూనిఫామ్స్, టెక్స్ట్ బుక్స్, వర్క్ బుక్కులు ,నోటు పుస్తకాలు వెంటనే సరిపడా సరఫరా చేయాలని, అల్పాహారాన్ని అందించాలని కోరారు. ఈ క్యాంపైన్లో జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు, మండల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు రామ్ చంద్, పుల్లయ్య, మహమ్మద్ అలీ, రాఘవరావు, శ్రీనివాసరావు , అనురాధ, దివ్య తదితరులు పాల్గొన్నారు.



# తాడిపత్రిలో ఘనంగా ఆంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవాలు...

తాడిపత్రి జులై 3 తాడిపత్రి పట్టణ సమీపంలో ఉన్న పెన్నా నది ఒడ్డున ఉన్న సువర్చల ఆంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారికి కుంకుమార్చన, కలసి పూజ, సహస్రనామార్చన ఇంకా అనేక పూజలను చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నేటితో ఆంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. అనంతరం ఆలయ పురోహితుడు రామనాథ్ ను ఆలయ కమిటీ నిర్వాహకుడు ఈశ్వరయ్య సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంజన్న, శివ, గురప్ప, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# – మంత్రి సీతక్క కృషితో ఏటూరునాగారం

## వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు భారీ నిధులు...

**- బిములుగు నియోజకవర్గానికి రూ. 2.82 కోట్ల మంజూరు.**

**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 03**

**- రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబాటు...**

**- వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధి పనులకు శ్రీకారం...**



- పాలయకొట్టి పనులను ప్రారంభించిన ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి గకార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు...

ఏటూరునాగారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి మంత్రి గారి ప్రత్యేక కృషితో ములుగు నియోజకవర్గానికి మొత్తం రూ. 2 కోట్ల 82 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఇందులో ఏటూరునాగారానికి రూ. 2 కోట్లు, తాడ్వాయికి రూ. 82 లక్షలు కేటాయించడం విశేషం. ఇతర నియోజకవర్గాలకు కేవలం రూ. 1 కోటి మాత్రమే మంజూరు అయినప్పటికీ, మంత్రి సీతక్క మంత్రి తుమ్మల నాగేశ్వరావు గారితో ప్రత్యేకంగా మాట్లాడి అదనపు నిధులు సాధించడం ఆమె చిత్తశుద్ధికి నిదర్శనం...

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపయోగంగా మారిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండా ఉండేది. ముఖ్యంగా సీసీ రోడ్లు సరిగా లేక వాహనాలు దిగబడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో మార్కెట్‌ను ఉపయోగించుకోవడం కూడా కష్టసాధ్యంగా మారింది...

అయితే నేడు మంత్రి సీతక్క దూరదృష్టి, ప్రత్యేక చొరవతో మార్కెట్ యార్డ్‌కు కొత్త రూపురేఖలు తీసుకురానున్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ రంగ అభివృద్ధికి ఆమె పెద్దపీట వేస్తున్నారు....

ఈ అభివృద్ధి పనులకు ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ కొబ్బరికాయలు కొట్టి శుభారంభం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు...

ఈ సందర్భంగా రేగా కళ్యాణి మాట్లాడుతూకొత్తగా నిర్మించబడే సౌకర్యాలతో రైతులు తమ పంటలను సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుంది. ఇది రైతులకు అన్ని విధాలా ఉపయోగపడుతుందని తెలిపారు...

రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి సీతక్క నాయకత్వంలో ములుగు నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తోందని ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి అన్నారు...

ఈ కార్యక్రమంలో జిల్లా, ఆత్మ చైర్మన్ చిటమట రఘు బ్లాక్,మండల, గ్రామ నాయకులు,యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# సీఎంఆర్ నిల్వ కేంద్రాలకు తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలి ::

## అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 03 2026** కలెక్టరేట్‌శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ నేత్ర ప్రకాష్, సంబంధిత అధికారులతో ధాన్యం నిల్వ కేటాయింపుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిర్ణీత ప్రమాణాల ప్రకారం సిఎంఆర్ ను నిల్వ కేంద్రాలకు తరలించే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం నిల్వ, రవాణా, మిల్లింగ్ ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ధాన్యం సి ఎం ఆర్ నిర్వహణలో పారదర్శకత పాటించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి ఫైజల్ హుస్సేన్, డి ఎం కృష్ణవేణి, డిటి సి యస్ విజయ్ కుమార్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ మైనారిటీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు

## తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 03 2026** ములుగు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2026--27 ఆర్థిక సంవత్సరానికి వివిధ స్వయం ఉపాధి పథకాల కింద ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి బి. రామ్మోహన్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు.

ఈ పథకాల కింద కుట్టు మిషన్, చిన్న వ్యాపారం, ఈ–బైక్, ఈ–స్కూటీ, మోటార్ బైక్ కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఈ పథకాలకు క్రిస్టియన్ మైనారిటీ వర్గానికి చెందిన వారు మాత్రమే అర్హులు అని తెలిపారు.

వయోపరిమితి విషయానికి వస్తే కుట్టు మిషన్, చిన్న వ్యాపారం కోసం 21 నుండి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఈ–బైక్, ఈ–స్కూటీ, మోటార్ బైక్ కోసం 21 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని తెలిపారు.

అలాగే కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు ఉండాలని స్పష్టం చేశారు.

అర్హులైన అభ్యర్థులు జూలై 3, 2026 నుండి జూలై 18, 2026 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల నమోదు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారిక వెబ్‌సైట్ అయిన్ స్త్రశీఎఎం.ఎన్త్ర్త.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ ను వినియోగించుకోవాలని తెలిపారు.

మరిన్ని వివరాల కోసం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం, సంక్షేమ భవనం, గది నంబర్--6, ములుగు ను సంప్రదించవచ్చని తెలిపారు. ఫోన్ నంబర్ 9989661146 ద్వారా కూడా సమాచారం పొందవచ్చన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com